సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం । 18 । మార్చి । 2023



గురుకులాల్లో ప్రవేశానికి..

2023-24 విద్యా సంవత్సరానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ విద్యార్థులు డాక్టర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి, ఇంటర్మీడియట్‌లో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానించారు. IIలో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.60,220
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,379
3 శాతం జీఎస్టీతో	రూ.5,540
నవర (8 గ్రా)	రూ.44,320

వాతావరణం

గరిష్టం/కనిష్టం 30.0 /25.6

శుక్రవారం గాలిలో 73 శాతం తేమ ఉంది. శనివారం అకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

ఇంటర్ పరీక్షలకు 903 మంది గైర్హాజరు

- పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు



మర్రిపాడు: పరీక్ష కేంద్రం వద్ద పోలీసులు

నెల్లూరు(టౌన్): ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు శుక్రవారం ఇంగ్లిష్‌-1 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జనరల్‌కు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 27,321 మందికి గానూ 26,577 మంది హాజరయ్యారు. 744 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 1,768 మందికి గానూ 1,609 మంది హాజరయ్యారు. 159 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఇంటర్‌బోర్డు అధికారి శేషుకుమారి, ఆర్‌ఐఓ వరప్రసాద్‌రావు, జిల్లా అబ్జర్వర్ మధుబాబు, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌లు 73 కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. కేంద్రాల పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

సంపద తయారీ కేంద్రం పరిశీలన



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ చిరంజీవి

మనుబోలు: మనుబోలు పంచాయతీ పరిధిలో జాతీయ రహదారి పక్కనున్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని శుక్రవారం జిల్లా జెడ్పీ సీఈఓ, డీపీఓ చిరంజీవి పరిశీలించారు. ఈ కేంద్రం పెద్దదిగా ఉన్నందున మోడల్ షెడ్‌గా తయారు చేసేందుకు సూచనలు, సలహాలిచ్చారు. ఇటీవల రూ.12 వేలకు వర్మీ కంపోస్టును విక్రయించినట్లు పంచాయతీ కార్యదర్శి వెంకటరమణయ్య సీఈఓకు తెలిపారు. జామ తోటలోని కాయలను కూడా బహిరంగ మార్కెట్‌లో విక్రయించి నగదును పంచాయతీ సాధారణ నిధులకు జమ చేయాలని సీఈఓ సూచించారు. మండలానికి ఇచ్చిన మినీ డోజర్‌తో తోట విస్తీర్ణాన్ని పెంచాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఈఓపీఆర్‌డీ రమణయ్య, పారిశుధ్య, ఎస్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది ఉన్నారు.

3,162 పొగాకు బేళ్ల విక్రయం



డీసీపల్లి కేంద్రంలో పొగాకు బేళ్లు

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రానికి శుక్రవారం 619 బేళ్లు రాగా వాటిలో 586 బేళ్లను విక్రయించామని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. మిగిలిన వాటిలో 14 నోబిడ్, 6 సీఆర్‌గా గుర్తించారు. మొత్తంగా 78,320 కిలోల పొగాకు అమ్ముడు కాగా రూ.1,55,11,248ల వ్యాపారం జరిగింది. ఒక కిలోకు గరిష్టంగా రూ.200, కనిష్టంగా రూ.190, సగటున రూ.198.05 ధర లభించింది. ఆరు కంపెనీలు పాల్గొన్నాయి.

- కలిగిరి: కలిగిరి పొగాకు వేలం కేంద్రానికి శుక్రవారం జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 2775 బేళ్లను అమ్మకానికి తీసుకురాగా 2,576 బేళ్లను కొనుగోలు చేశారని వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు. 199 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకుకు గరిష్టంగా రూ.200, కనిష్టంగా రూ.190, సగటున రూ.197.93 ధర లభించింది. వేలంలో 6 కంపెనీలు పాల్గొన్నాయి.

సోమశిలలో 56.513 టీఎంసీలు



సోమశిల జలాశయం

సోమశిల: సోమశిల జలాశయంలో శుక్రవారం సాయంత్రానికి 56.513 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పెన్నార్ డెల్టాకు 1,500 క్యూసెక్కులు, ఉత్తరకాలువకు 533, దక్షిణకాలువకు 300, కండలేరుకు 50 క్యూసెక్కుల వంతున నీరు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 97.508 మీటర్ల నీటి మట్టం నమోదైంది. సగటున 337 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో వృథా అవుతోంది.

పీడీఎఫ్‌కు ఎదురుదెబ్బ

మట్టికరిపించిన వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి

ఒకప్పుడు సమసమాజం.. పేదరిక నిర్మూలన.. సమాన పనికి సమాన వేతనం.. అంటూ విప్లవ భావాలను పుణికి పుచ్చుకుని ఉద్యమ కెరటాలతో కదం తొక్కిన వామపక్షాలు ఇప్పుడు దిగజారిపోయాయి. ఏ ఎండ కాగొడుగు పడుతూ సిద్ధాంతాలను తుంగలో తొక్కి అడ్డదారులు వెతుకుతున్నాయి. అందులో భాగంగానే ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీతో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకుని వైఎస్సార్‌సీపీని దెబ్బకొట్టాలని భావించాయి. ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరగకుండా అడగడుగునా అడ్డు తగిలాయి. కానీ వారి వ్యూహాలు, కుట్రలు, కుతంత్రాలు పటాపంచలయ్యాయి. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి విజయకేతనం ఎగురవేశారు. పీడీఎఫ్ విజయ పరంపరాలకు అడ్డుకట్ట వేశారు.

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఘోర పరాజయం
- వామపక్ష విధానాలకు తిలోదకాలొదిలిన సీపీఎం, సీపీఐ
- టీడీపీతో చేతులు కలిపినా వరించని విజయం
- ప్రతి రౌండ్‌లోనూ చంద్రశేఖర్‌రెడ్డికి ఆధిక్యం



రిటర్నింగ్ అధికారి హరినారాయణన్ చేతుల మీదుగా డిక్లరేషన్ పత్రం అందుకుంటున్న పర్వతరెడ్డి

సాక్షి, తిరుపతి/సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల చరిత్రలో ఓటమి ఎరుగని పీడీఎఫ్‌కు వైఎస్సార్‌సీపీ గట్టి షాక్ ఇచ్చింది. మొదటిసారిగా పీడీఎఫ్‌కు ఓటమిని రుచిచూపించింది. తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి ఘన విజయం సాధించారు. ఉమ్మడి ప్రకాశం – నెల్లూరు – చిత్తూరు జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఇటీవల ఎన్నికలు నిర్వహించిన విషయం తెలిసిందే. వైఎస్సార్‌సీపీకి ప్రజల్లో ఉన్న మద్దతును దృష్టిలో ఉంచుకుని ఓటమి తప్పదని పీడీఎఫ్ భావించింది. వామపక్ష భావాలకు విరుద్ధంగా సీపీఎం, సీపీఐ నాయకులు టీడీపీతో జతకట్టారు. ఆ పార్టీ సహకారంతో పీడీఎఫ్ తమ అభ్యర్థికి ఎన్నోకొన్ని ఓట్లు వస్తాయని భావించింది. అందులో భాగంగా టీడీపీతో కలిసి ఎన్నికలకు ముందు నుంచి నానారభస చేశారు. నిజమైన ఓటర్లను సైతం దొంగ ఓటర్లుగా చిత్రీకరించి భయభ్రాంతులకు గురిచేశారు. ఓటింగ్ శాతాన్ని తగ్గించేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. ఉపాధ్యాయులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నారని పచ్చమీడియా, టీడీపీ నాయకులు ప్రచారం చేశారు. కానీ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపులో వైఎస్సార్‌సీపీ జోరు ఏ మాత్రం తగ్గలేదని నిరూపితమైంది. ప్రభుత్వంపై వ్యతిరేకతతో లేమని టీచర్లు తమ ఓటు ద్వారా చరిత్రాత్మకమైన తీర్పునిచ్చారు.

విజయ'శేఖరుడు'

చిత్తూరు సమీపంలోని ఎస్వీ సెట్‌లో గురువారం నిర్వహించిన కౌంటింగ్‌లో పీడీఎఫ్ అభ్యర్థి ఏ ఒక్క రౌండ్‌లోనూ మెజారిటీ సాధించలేకపోయారు. మొదటి రౌండ్ నుంచి రెండో ప్రాధాన్యత ఓటు లెక్కింపు వరకు చంద్రశేఖర్‌రెడ్డి ఆధిక్యం కనబరుస్తూ వచ్చారు. శుక్రవారం వేకువజాము వరకు ఉత్కంఠంగా సాగిన కౌంటింగ్‌లో చంద్రశేఖరరెడ్డి విజయఢంకా మోగించారు. ఎన్నికలు ఏవైనా.. ప్రతిపక్షంలో ఎవరున్నా.. వైఎస్సార్‌సీపీకే తమ మద్దతు అని ఉపాధ్యాయ ఓటర్లు మరోసారి రుజువు చేశారు. కృష్ణచైతన్య విద్యాసంస్థల అధినేతగా సింహపురి వాసులకు సుపరిచితుడైన పర్వతరెడ్డి వైఎస్సార్‌సీపీ అభిమానిగా ఉన్నారు. రెడ్‌క్రాస్ చైర్మన్‌గా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన విజయంపై నెల్లూరు ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పీడీఎఫ్‌కు మొదటిసారి ఓటమి

పీడీఎఫ్‌కు మొదటిసారి ఓటమి ఎదురైంది. 1980 దశకంలో అప్పటి సీఎం ఎన్టీ రామారావు శాసన మండలిని రద్దు చేశారు. ఆ తర్వాత 2007లో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి తిరిగి మండలిని పునరుద్ధరించారు. అప్పటి నుంచి మూడు సార్లు మండలి ఎన్నికలు నిర్వహించారు. 2007లో పీడీఎఫ్ అభ్యర్థి దాచూరి రామిరెడ్డి, 2011–2017, 2017–2023 వరకు పీడీఎఫ్ అభ్యర్థి విఠపు బాల సుబ్రహ్మణ్యం టీచర్ ఎమ్మెల్సీలుగా గెలుపొందారు. 16 ఏళ్లుగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాన్ని కైవసం చేసుకుంటున్న పీడీఎఫ్‌కు మొదటిసారి ఎదురుదెబ్బ తగిలింది.

సన్మానం

శ్రీకాళహస్తి: తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించిన పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని శుక్రవారం శ్రీకాళహస్తీశ్వర ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో జరిగిన ఈ సన్మాన కార్యక్రమానికి పలువురు విచ్చేసి ఆయనకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, సుబ్బరామిరెడ్డి, విద్యాసాగర్, చిలకా రంగయ్య, ఢిల్లీబాబు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఘన స్వాగతం



చంద్రశేఖర్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుతో ఘన విజయం సాధించిన పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి నెల్లూరు సిటీ నియోజకవర్గం ఆధ్వర్యంలో శుక్రవారం ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన తర్వాత తొలిసారిగా సిటీకి వచ్చిన ఆయనకు మద్రాస్ బస్టాండ్ సౌతిండియా షాపింగ్‌మాల్ వద్ద నాయకులు పూలమాలలు, బొకేలను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్‌అహ్మద్, నగర నియోజకవర్గ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పర్వతరెడ్డి బయోడేటా

జననం : ఉమ్మడి నెల్లూరు జిల్లా చిల్లకూరు మండలంలోని వల్లిపేడు గ్రామం.

తల్లిదండ్రులు : సుందరరామిరెడ్డి, సుజాతమ్మ

చంద్రశేఖర్‌రెడ్డి పదో తరగతి నెల్లూరులోని జెడ్పీ పాఠశాలలో, ఇంటర్మీడియట్, డిగ్రీ సర్వోదయ కళాశాలలో చదివారు. ఎంఎస్సీ మ్యాథ్స్ ఎస్వీ యూనివర్సిటీ క్యాంపస్‌లో, అనంతరం తిరుపతిలోనే ఎంబీఏ పూర్తి చేశారు. 1994లో వీఆర్ కళాశాలలో పార్ట్‌టైం లెక్చరర్‌గా పనిచేశారు. అదే సమయంలో ఆయన గురువు డాక్టర్ ఆర్వీ కృష్ణారెడ్డితో కలిసి మ్యాథ్స్ ట్యూషన్స్, బీఈడీ కోచింగ్ ఇచ్చేవారు. 1998లో కృష్ణచైతన్య డిగ్రీ కళాశాల, అనంతరం ఇంటర్, పీజీ కళాశాలలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వేలాది మంది విద్యార్థులకు తక్కువ ఫీజుతో అత్యుత్తమ బోధన చేస్తున్నారు.

- చంద్రశేఖర్‌రెడ్డి రెడ్‌క్రాస్ చైర్మన్‌గా ఫిబ్రవరి 2020లో ఎన్నికయ్యారు. కరోనా కాలంలో వేలాదిమంది వలస కార్మికులకు భోజనాలు ఏర్పాటు చేశారు. కోవిడ్ ఆస్పత్రుల్లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసి రెడ్‌క్రాస్ వలంటీర్ల ద్వారా బాధితులకు పండ్లు, మజ్జిగ, తాగునీరు అందించారు. కరోనాతో చనిపోయిన వారికి రెడ్‌క్రాస్ తరఫున దహన సంస్కారాలు చేయించారు. కోవిడ్ రెండో వేవ్‌లో తమ విద్యాసంస్థలకు చెందిన రెండు బస్సుల్లో బెడ్లు ఏర్పాటు చేసి అందులోనే రోగులకు ఉచితంగా ఆక్సిజన్ అందించారు. రెడ్‌క్రాస్‌కు సైతం రూ.25 లక్షల భూరి విరాళాన్ని ఇచ్చారు. వరద బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించి వారికి అన్ని వసతులు ఏర్పాటు చేశారు. ఇలా ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారు.

– నెల్లూరు(అర్బన్)

పోయిరా చెల్లి!

- ముగిసిన ముత్యాలమ్మ జాతర
- చెల్లి పోలేరమ్మకు వీడ్కోలు
- అట్టహాసంగా నిమజ్జనం



వరపడిన మహిళలపై నడచి వస్తున్న గణాచారి



నిమజ్జనానికి తరలివెళ్తున్న పోలేరమ్మ

చిల్లకూరు: తీర ప్రాంతంలోని తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో నాలుగు రోజులుగా జరిగిన జాతర శుక్రవారం పోలేరమ్మను సాగనంపడంతో ముగిసింది. మూడురోజులుగా అక్కడే ఉండి అమ్మవారికి మొక్కులు చెల్లించిన భక్తులు పోలేరమ్మను సాగనంపిన తర్వాత తమ గ్రామాలకు పయనమయ్యారు.

జై పోలేరు..జైజై పోలేరు

గంగమిట్ట మీద బుధవారం వేకువజామున కొలువుదీరిన పోలేరమ్మకు మూడురోజులపాటు అత్యంత భక్తిశ్రద్ధలతో భక్తులు ముడుపులు చెల్లించి పూజలు చేశారు. శుక్రవారం వేకువజామున అమ్మవారికి ఏడు కుండల్లో వండిన అన్నాన్ని కుంభంగా పోసి నైవేద్యం సమర్పించారు. అలాగే గణాచారికి ఊయలు సేవ నిర్వహించారు. గ్రామంలోని పెద్దలు పోలేరమ్మ కథను ఆసాదుల ద్వారా వినిపించారు. పొలి అన్నం గ్రామ శివారు ప్రాంతాల్లో చల్లారు. చివరగా అమ్మవారి గుడి వద్దకు రాగానే పోలేరుతల్లి.. కరుణించుమ్మా.. జై పోలేరు అంటూ కేకలు వేస్తుండగా అమ్మవారి విగ్రహాన్ని తలపై మోసుకుంటూ గ్రామంలో ఊరేగింపుగా బయలుదేరారు.

ఆచారం.. పరమపవిత్రం

గంగ మిట్టమీద నుంచి పోలేరమ్మ తల్లిని నిమజ్జనం చేసేందుకు తీసుకెళ్తుండగా గణాచారి నుంచి అనుమతి తీసుకున్నారు. పోలేరమ్మ నిమజ్జనానికి వెళ్లే మార్గంలో మహిళలు కొత్త దుస్తులను దారిలో పరిచి వరపడ్డారు. వారిపై నుంచి గణాచారి నడిచి వెళ్తూ పోలేరమ్మను సాగనంపారు.

వెళ్లొస్తా అక్కా..

ఏడాదికి ఒకసారి వచ్చే పోలేరమ్మ తన పెద్ద సోదరి ముత్యాలమ్మకు వెళ్లి వస్తానని పలకరించే సన్నివేశాన్ని గణాచారి చెబుతుండగా అక్కడికి చేరుకున్న భక్తులు తన్మయత్వంతో పులకించిపోయారు. ఈ సందర్భంగా అక్కా, పోయి వస్తనే.. అంటూ పోలేరమ్మ అంటుండగా.. వచ్చే ఏడాది మళ్లీరా.. చెల్లి అని ముత్యాలమ్మ పలికినట్లు గణాచారి చెప్పడంతో అక్కడున్న భక్తులు పొలికేకలు పెట్టి పోలేరమ్మ తల్లికి జై.. అంటూ నినాదాలు చేశారు. అనంతరం గుడి వెనుక ఉన్న ద్వారంలో నుంచి పోలేరమ్మను ముత్యాలమ్మ ఆలయానికి కొంత దూరంలో ఉన్న జీడి మామిడి చెట్టు వద్దకు తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

అనుమతి లేకుండా కౌంటింగ్ కేంద్రంలోకి..

- కందుకూరు వాసిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

చిత్తూరు కలెక్టరేట్: చిత్తూరు సమీపంలోని ఎస్వీసెట్‌లో నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ కౌంటింగ్ కేంద్రంలోకి శుక్రవారం కందుకూరుకు చెందిన చంద్రశేఖర్ అనే వ్యక్తి అనుమతి లేకుండా వెళ్లాడు. అనుమానాస్పదంగా తిరుగుతున్న అతడిని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరినారాయణన్ గుర్తించారు. కిందిస్థాయి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుమతి కార్డు లేకుండా లోనికి ఎలా పంపుతారని విధుల్లో ఉన్న పోలీసులపై మండిపడ్డారు. ఈ ఘటనపై విచారణ చేయాలని చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తిని ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఆదేశించారు. పోలీసులు చంద్రశేఖర్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈ విషయంపై డీఎస్పీ విలేకరులతో మాట్లాడారు. చంద్రశేఖర్ కందుకూరులో ఓ మీడియాలో పనిచేస్తారన్నారు. అతడికి ఎటువంటి కార్డు లేకున్నా డీపీఆర్వో అనుమతితో లోనికి వచ్చాడని చెప్పారు. మీడియా పాయింట్‌లో లేకుండా ఓట్ల లెక్కింపు కేంద్రంలోకి వెళ్లాడన్నారు. విధుల పట్ల అలసత్వం వహించిన పోలీసులపై ఎస్పీ, డీపీఆర్వోపై శాఖాపరమైన చర్యలకు ఆదేశించారని డీఎస్పీ వెల్లడించారు.

పలు మండలాల్లో వర్షం

- ఆందోళనలో అన్నదాతలు



కలిగిరి పొలాల్లో నెలకొరిగిన వరి పంట

నెల్లూరు(అర్బన్): జిల్లాలోని పలు మండలాల్లో శుక్రవారం వర్షం కురిసింది. అకాల వర్షంతో కొన్నిచోట్ల కోతకు వచ్చిన వరి పంట నెలకొరిగింది. మరోవైపు వివిధ ప్రాంతాల్లో వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. పంట కల్లాల్లోనే ఉంది. ఆరుగాలం కష్టించి పండించిన పంట ఎక్కడ నీటిపాలవుతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. అయితే వర్షం చిరుజల్లులకే పరిమితం కావడంతో ధాన్యానికి ఎటువంటి నష్టం చేకూరలేదని అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా వాతావరణ శాఖాధికారులు శనివారం వర్షాలు కురుస్తాయని ముందస్తు హెచ్చరికలు చేశారు.

వస్త్ర నగరి



కావలి వస్త్ర మార్కెట్‌లోని దుకాణాలు

వస్త్ర దుకాణాలకు జిల్లాలో కావలి పెట్టింది పేరు. స్వాతంత్రానికి పూర్వమే ఇక్కడ ఈ వ్యాపారం జరిగింది. ఆ రోజుల్లో ఇళ్లలో అమ్మకాలు చేస్తుండేవారు. నేడు వందలాది దుకాణాలున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి దుస్తులను తెచ్చి విక్రయిస్తుంటారు. ఈ రంగం ద్వారా ఉపాధి పొందేవారు ఎక్కువే.

- కావలిలో నాలుగు మార్కెట్లు
- నివాసాల్లోనూ అమ్మకాలు
- వేలాది మందికి ఉపాధి
- ఏడాదికి రూ.500 కోట్ల టర్నోవర్ అంచనా

వస్త్ర దుకాణాలు : 500కు పైగా..

ఉపాధి : సుమారు 4,000 మందికి

కావలి: కావలిలో అన్నపూర్ణ, అరుణోదయ, నవోదయ, శుభోదయ పేర్లతో వస్త్ర మార్కెట్లు ఉన్నాయి. కొందరు దుకాణాల ద్వారా, మరికొందరు తమ నివాసాల్లోనే వ్యాపారం చేస్తుంటారు. ఇక్కడి వస్త్ర వ్యాపారం ద్వారా ఏడాదికి రూ.500 కోట్ల మేర టర్నోవర్ జరుగుతుందని అంచనా. దీంతో పన్నుల రూపంలో ప్రభుత్వ ఖజానాకు నగదు జమవుతోంది.

వ్యాపారం ఎలా జరుగుతుందంటే..

వ్యాపారులు మహారాష్ట్ర, గుజరాత్, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాల్లో వస్త్ర పరిశ్రమల నుంచి భారీగా కొనుగోలు చేస్తుంటారు. కొందరు వ్యాపారులు కనీసం రూ.20 లక్షలకు తగ్గకుండా పెట్టుబడి పెడుతుంటారు. కొనుగోలు చేసిన దుస్తులను కావలికి తరలించి నాణ్యతను బట్టి ధరలు నిర్ణయిస్తారు. స్థానికంగా, మన రాష్ట్రంలో జిల్లాలు, తెలంగాణ రాష్ట్రాల్లోని చాలా పట్టణాల్లోని వస్త్ర వ్యాపారులకు హోల్‌సేల్ ధరలకు పంపిస్తుంటారు. నగదు వసూళ్లను మార్కెటింగ్ సిబ్బంది ద్వారా చేయిస్తుంటారు.

ఎక్కడి నుంచి తెస్తారంటే..

ముంబై నుంచి చొక్కా, ప్యాంట్లు, సూరత్, బెనారస్, బెంగళూరు నుంచి చీరలు తెస్తుంటారు. అలాగే కోల్‌కతా, జబల్‌పూర్, నాగపూర్ నుంచి రెడీమేడ్ దుస్తులు, అహ్మదాబాద్ నుంచి డ్రస్ మెటీరియల్స్, కంచి, ధర్మవరం నుంచి పట్టు చీరలు, ఈరోడ్, సేలం నుంచి టవళ్లు, లుంగీలు, పంచెలు కావలికి తేవడం జరుగుతోంది.

తొలి తయారీ పరిశ్రమ

కందుకూరి వెంకట సత్యనారాయణ అనే వ్యాపారి 20 ఏళ్ల క్రితం కావలి వద్ద వస్త్రాలు తయారు చేసే పరిశ్రమను ఏర్పాటు చేశారు. ఇందులో 100 మందికి పైగా ఉపాధి పొందుతున్నారు. ఇంకా నైటీలు తయారు చేసే రెండు కేంద్రాలు ఈ ప్రాంతంలో ప్రారంభమయ్యాయి.



ఓ దుకాణంలో..

ఇప్పుడిలా..

ఒకప్పుడు వ్యాపారులు ఇతర రాష్ట్రాలకు రైళ్లలో వెళ్లేవారు. నేడు చెన్నైకి వెళ్లి అక్కడి నుంచి విమానంలో ముంబై, అహ్మదాబాద్‌కు చేరుకుంటున్నారు. దుస్తులు కొనుగోలు చేసి త్వరగా సొంతూరికి చేరుకుంటున్నారు. ఖర్చు కొంచెం అధికమైనా సమయం కలిసొస్తుందని చెబుతున్నారు.

ప్రభుత్వానికి రాబడి



కావలిలో జరిగే వస్త్ర వ్యాపారం వల్ల ప్రతి రూ.100కు రూ.5 జీఎస్టీ రూపంలో ప్రభుత్వ ఖజానాకు జమవుతోంది. అందులో రూ.2.50లు కేంద్ర ప్రభుత్వానికి, రూ.2.50లు రాష్ట్ర ప్రభుత్వానికి చేరుతోంది. కాగా రోడ్డు మార్జిన్లలో వస్త్రాల అమ్మకాలు పెరిగిపోతున్నాయి. దీంతో వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

– తటవర్తి నరసింహం, వస్త్ర వ్యాపారుల సంఘం నాయకుడు

మాల్స్ వల్ల వ్యాపారాలు తగ్గాయి



మాల్స్, ఆన్‌లైన్ విక్రయ సంస్థలు ప్రజలను ఆకర్షింపజేస్తూ వస్త్రాల అమ్మకాలు చేస్తున్నాయి. మన్నిక, నాణ్యత సంగతి గురించి పట్టించుకోవడం లేదు. దుస్తులు బాగుండాలని కోరుకునే వారు స్థానికంగా దుకాణాల్లో కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు.

– పెట్టుగాని రమేష్, వస్త్ర వ్యాపారుల సంఘం నాయకుడు, కావలి

ఉపాధి కల్పిస్తోంది



కావలిలోని వస్త్ర వ్యాపారం స్థానికంగా అనేక మందికి ఉపాధి కల్పిస్తోంది. పెద్ద సంఖ్యలో ఉపాధి చూపే రంగంగా సుస్థిరమైన స్థానం సంపాదించుకుంది.

– చీదెళ్ల కిశోర్, వస్త్ర వ్యాపారి, కావలి

క్లుప్తంగా

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(వేదాయపాళెం): 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ విద్యార్థులు డాక్టర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశం పొందేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని ఏపీ సాంఘిక సంక్షేమ వసతి, విద్యాసంస్థల జిల్లా కో ఆర్డినేటర్ టి.హేమలత శుక్రవారం తెలిపారు. విద్యార్థులు ఈ నెల 24వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. ఏప్రిల్ 23వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 5వ తరగతికి, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి నిర్వహించే ప్రవేశ పరీక్షలో విద్యార్థులు ప్రతిభ చూపి ప్రవేశాలు పొందవచ్చు. 5వ తరగతికి https:// apgpcet. apfss.in వెబ్‌సైట్ ద్వారా, ఇంటర్మీడియట్‌కు https:// apgpcet.apfss.in/inter వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 24న సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు చేసుకోవచ్చు.

తలనీలాల పాట రూ.2.16 కోట్లు



వేలం పాట నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

వలేటివారిపాళెం: మండలంలోని మాలకొండలో వెలిసిన మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి సంబంధించిన తలనీలాల వేలం పాట శుక్రవారం కొండ మీద ఉన్న కల్యాణ మండపంలో జరిగింది. తిరుపతికి చెందిన గరుడా ఎంటర్‌ప్రైజెస్ రూ.2,16,99,999కు అధికంగా టెండర్ వేసి సొంతం చేసుకున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.బి.శ్రీనివాస రావు తెలిపారు. ఏప్రిల్ 1, 2023 నుంచి మార్చి 31, 2024 వరకు తలనీలాలు పోగు చేసుకునే హక్కు గరుడా ఎంటర్‌ప్రైజర్స్ దక్కించుకుందని తెలిపారు. కార్యక్రమంలో వేలం పాట పర్యవేక్షణ అధికారి బైరాగి, ఆలయ సిబ్బంది నారాయణ, కోటేశ్వరావు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

బిట్రగుంట: బోగోలు మండలం కోవూరుపల్లికి చెందిన మన్నేపల్లి పోలయ్య(56) అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన శుక్రవారం వెలుగుచూసింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు కోవూరుపల్లికి చెందిన మన్నేపల్లి పోలయ్యకు మద్యం తాగే అలవాటు ఉంది. బోగోలుకు వచ్చి తరచూ మద్యం తాగి వెళుతుండేవాడు. ఈ క్రమంలో విశ్వనాథరావుపేట పంచాయతీ ఇబ్రహీంపేటలో నిర్మాణంలో ఉన్న ఇంటికి సంబంధించిన మరుగుదొడ్డి కోసం తీసిన గుంతలో విగతజీవిగా పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహం ఉబ్బిపోయి ఉండడంతో రెండు, మూడు రోజుల క్రితమే మృతిచెంది ఉండవచ్చని భావిస్తున్నారు. ఇన్‌చార్జి ఎస్సై ఆదిలక్ష్మి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సరికొత్త హంగులతో..

నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు అన్ని వసతులను కల్పించడమే లక్ష్యంగా, భవిష్యత్‌లో కూడా రైల్వే వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. తూర్పు, పశ్చిమం వైపున కొత్త స్టేషన్ భవన నిర్మాణ పనులు చేపడుతున్నారు.



రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న ఆధునికీకరణ పనులు

నెల్లూరు రైల్వేస్టేషన్‌లో సకల సౌకర్యాలు
- రూ.102 కోట్లతో ఆధునికీకరణ
- శరవేగంగా నిర్మాణ పనులు
- వచ్చే ఏడాది మే నెల లోపు పూర్తి చేసేలా లక్ష్యం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నెల్లూరులోని ప్రధాన రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సకల సౌకర్యాలతో ఈ స్టేషన్‌ను అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.102 కోట్లు నిధులు విడుదల చేసింది. ఇందులో భాగంగా ప్రస్తుతం ఉన్న రైల్వేస్టేషన్ కట్టడాలను తొలగించి నూతన హంగులతో సరికొత్త భవన సముదాయాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దనున్నారు.

ఆధునికీకరణకు శ్రీకారం

కేంద్ర ప్రభుత్వం 'ప్రధాన రైల్వేస్టేషన్ల పునరాభివృద్ధి' అనే ప్రతిష్టాత్మక ప్రాజెక్టును చేపట్టింది. ఇందులో భాగంగా రైల్వేస్టేషన్లను సుందరంగా తీర్చిదిద్దేందుకు, అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలను కల్పించడానికి ఎంచుకున్న స్టేషన్ల జాబితాలో నెల్లూరు రైల్వేస్టేషన్‌కు స్థానం దక్కింది. ఈ స్టేషన్ గ్రాండ్‌ట్రంక్ మార్గంలో ఉండడంతో ఆధునికీకరణకు రైల్వేశాఖ శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలోని ముఖ్యమైన నగరాల్లో నెల్లూరు ఉండడం, ఏటా ప్రయాణికుల రద్దీ పెరుగుతుండడంతో భవిష్యత్‌లో స్టేషన్‌లో ప్రయాణికులకు అన్ని సౌకర్యాలు కల్పించేలా ఆయా పనులకు సంబంధించిన ప్రణాళికలు రూపొందించింది.

2024 మే నాటికి..

నెల్లూరు రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులను చేపట్టేందుకు హైదరాబాద్‌కు చెందిన మెస్సర్ ఎస్‌సీఎల్ ఇనఫ్రాటెక్ లిమిటెడ్ సంస్థకు ఈపీసీ విధానంలో ప్రభుత్వం కాంట్రాక్టును అప్పగించింది. ఈ పనులను 2024 మే నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. శరవేగంగా జరుగుతున్న పనుల్లో మొదటగా సైట్ కార్యాలయాలు నెలకొల్పడం, కాంక్రీట్ టెస్టింగ్ ల్యాబ్ మెటీరియల్‌ను ఉంచడానికి నిల్వ షెడ్‌ల ఏర్పాటు ఇప్పటికే పూర్తి చేశారు. స్టేషన్‌ను మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు, కొత్త స్టేషన్ భవనం నిర్మాణానికి సిద్ధం చేసిన నమూనాను ఇప్పటికే చెన్నైకి చెందిన ఐఐటీ నిపుణులు పరిశీలించి నిర్ధారించారు. వీటితోపాటు రైల్వే కోర్టు, జీఆర్పీ కార్యాలయాల నిర్వహణ కోసం తాత్కాలిక షెడ్ల నిర్మాణం పూర్తి చేశారు. వాటిని సంబంధిత శాఖలకు అప్పగిస్తున్నారు. శాశ్వత కోర్టు భవన నిర్మాణం కోసం పునాదులు, అలాగే ఫుటింగ్‌ల కోసం తవ్వకం పనులు పూర్తి చేశారు. కాంక్రీట్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ప్రస్తుత భవనంలో కొన్ని మార్పులతోపాటు స్టేషన్‌కు ఇరువైపులా నిర్మాణాలను పొడిగిస్తూ పనులు చేస్తున్నారు. తూర్పువైపు స్టేషన్ భవనం నిర్మించేందుకు పనులు జరుగుతున్నాయి. అదేవిధంగా పశ్చిమం వైపు పొడిగింపు పనుల కోసం పాత నిర్మాణాలను కూల్చి వేసి కొత్తస్టేషన్ భవన నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు.

పురోగతిలో పనులు

కొత్త స్టేషన్ భవనంలో సీఓపీలు(ప్లాట్‌ఫాంపై కప్పులు) తగినన్ని ఏర్పాటు చేయనున్నారు. ప్లాట్‌ఫాం పైకప్పుల వెల్డింగ్ పనులు పురోగతిలో ఉన్నాయి. ప్లాట్‌ఫాం నంబర్–1, 2, 3, 4లలో ఎక్కువ బోగీలు ఉన్న రైళ్లు కూడా నిలిచేలా నిర్మాణాలు చేపడుతున్నారు. 6 లక్షల లీటర్ల సామర్థ్యంతో భూగర్భ నీటి రిజర్వాయర్ నిర్మాణానికి తవ్వకం, పునాదుల పనులు కూడా పూర్తి చేశారు.

ప్రణాళికాబద్ధంగా పనులు

నెల్లూరు రైల్వేస్టేషన్‌లో ప్రారంభమైన పునరాభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా, దశలవారీగా చేపట్టడం వల్ల ప్రయాణికులకు ఎలాంటి ఆటంకం కలగకుండా చేస్తున్నాం. పునరాభివృద్ధి వల్ల ఆధునిక సౌకర్యాలతో స్టేషన్‌కు మరింత నూతన శోభ చేకూరనుంది. సౌకర్యాలు కల్పించడం వల్ల రైలు వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

– శ్రీఅరుణ్‌కుమార్ జైన్, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్

సాహితీ బ్రహ్మోత్సవాలకు తరలిరండి

తిరుపతి కల్చరల్: శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో తిరుపతి మహతి కళాక్షేత్రంలో ఏప్రిల్ 9, 10 తేదీల్లో 48 గంటలపాటు వరల్డ్ రికార్డు కోసం చేపడుతున్న ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలకు రచయితలు, కవులు, భాషాభిమానులు, కళాకారులు తరలిరావాలని శ్రీశ్రీకళావేదిక అంతర్జాతీయ అధ్యక్షుడు కింగ్ ఇంద్ర పిలుపునిచ్చారు. శుక్రవారం తిరుపతిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ కళావేదిక జాతీయ అధికార ప్రతినిధిగా నియమితులైన ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు సాహితీ బ్రహ్మోత్సవ ప్రోగ్రామ్ కన్వీనర్ గుత్తా హరిసర్వోత్తమనాయుడుని ఘనంగా సత్కరించారు.



సాహితీ బ్రహ్మోత్సవాల ప్రచార కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

గజ వాహనంపై సిరుల తల్లి



గజవాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న శ్రీవారి పట్టపురాణి

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారు శుక్రవారం సాయంత్రం గజవాహనంపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. వారపు ఉత్సవాల్లో భాగంగా తెల్లవారుజామున అమ్మవారిని మేల్కొలిపి నిత్యకైంకర్యాలను నిర్వహించారు. అభిషేక సేవానంతరం మరకత మాణిక్యాలు, వజ్రవైడూర్యాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం శ్రీకృష్ణ ముఖమండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లకు పాంచరాత్ర ఆగమోక్తంగా కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలోని అలంకార మండపంలో అమ్మవారికి ఊంజల్‌సేవను నిర్వహించారు. తదుపరి అమ్మవారు గజవాహనంపై ఆశీనులై నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ కనువిందు చేశారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, సూపరింటెండెంట్ శేషగిరి, ఏఈ రామ్మోహన్ పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ఏఆర్ డీజీపీ

శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శుక్రవారం అరుణాచల్‌ప్రదేశ్(ఏఆర్) డీజీపీ సతీష్ గొల్చా కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ప్రత్యేక రాహుకేతు పూజల్లో పాల్గొన్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. తదుపరి ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చి, స్వామి,అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఒకటో పట్టణ సీఐ అంజుయాదవ్, ఆలయ అధికారులు శ్రీనాథ్ పాల్గొన్నారు.

శరవేగంగా మైపాడురోడ్డు నిర్మాణ పనులు



మైపాడు గేట్ సెంటర్ నుంచి చేపల మార్కెట్ వరకు నాలుగు లేన్ల సిమెంట్ రోడ్డు నిర్మాణం



రోడ్డు నిర్మాణ పనుల్లో కూలీలు

- రూ.7.57 కోట్లతో 2.4 కి.మీ సిమెంట్ రోడ్డు
- గడువుకు ముందే పూర్తి చేసేందుకు చర్యలు
- ప్రస్తుతం 50 శాతం మేర పూర్తయిన పనులు
- మరో 2 నెలల్లో మొత్తం పూర్తయ్యే అవకాశం

నెల్లూరు (బారకాసు): వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత సింహపురి అభివృద్ధి పథంలో పరుగులు పెడుతోంది. అందులో భాగంగానే వాహనదారులకు ట్రాఫిక్ ఇక్కట్లు లేకుండా ఉండేందుకు నగరంలోని పొదలకూరు రోడ్డులో, ముత్తుకూరు రోడ్డు తదితర ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణాలు ఇప్పటికే పూర్తి చేశారు. అదేవిధంగా ప్రస్తుతం మైపాడు రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. నెల్లూరు నగరం నుంచి ఇందుకూరుపేట మండలానికి వెళ్లే ప్రధాన రహదారి అయిన మైపాడురోడ్డును గతంలో అధికారంలో ఉన్న టీడీపీ పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మైపాడురోడ్డు నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంది.

రూ.7.57 కోట్లతో సిమెంట్ రోడ్డు

నగరంలోని పాత చెక్‌పోస్టు నుంచి చేపల మార్కెట్ వరకు 2.4 కి.మీ మేర నాలుగులేన్ల సిమెంట్‌రోడ్డుని రూ.7.57 కోట్ల ఖర్చుతో నిర్మాణం చేపట్టారు. ఇప్పటికే 50 శాతం మేర రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేశారు. మిగిలిన 50 శాతం పనులను మరో రెండు నెలల్లో పూర్తి చేసేందుకు ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు చేపడుతున్నారు.

ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా

నెల్లూరు నగరంలో నుంచి ఇందుకూరుపేట మండలానికి వెళ్లేందుకు ప్రధాన రహదారి మైపాడురోడ్డు. మైపాడు బీచ్‌కు వెళ్లాలన్నా ఈ రహదారి నుంచే వెళ్లాలి. జిల్లా నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా పర్యాటకులు మైపాడు బీచ్‌కు వస్తుంటారు. దీంతో మైపాడు రోడ్డులో భారీవాహనాలు, కార్లు, ఆటోలు, బైక్‌ల రాకపోకలతో నిత్యం ట్రాఫిక్ ఎక్కువగా ఉంటోంది. ఇటువంటి పరిస్థితుల్లో ఆర్‌అండ్‌బీ అధికారులు ఓవైపు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా మరోవైపు రోడ్డు నిర్మాణ పనులకు ఆటంకం కలగకుండా ఉండేలా తగు చర్యలు తీసుకుంటూ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు.

సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రజలు

దశాబ్దాల కాలం నుంచి మైపాడురోడ్డు గురించి పట్టించుకున్న నాథుడే లేకపోవడంతో ఈరోడ్డులో ప్రయాణం చేయాలంటే ప్రజలు అనేక ఇబ్బందులు పడేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ చొరవతో మైపాడు రోడ్డుకు పనులు చేపట్టారు. త్వరలోనే ఈ రోడ్డు నిర్మాణ పనులు పూర్తికానుండడంతో స్థానిక ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నగరాభివృద్ధే లక్ష్యం



నెల్లూరు నగరాన్ని అభివృద్ధి చేయడమే నా లక్ష్యం. టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో ఈ రోడ్డును పట్టించుకోలేదు. మైపాడురోడ్డు నిర్మాణం కోసం ఈ ప్రాంత ప్రజల పరిస్థితులను సీఎం దృష్టికి తీసుకెళ్లాను. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటనే నిధులు మంజూరు చేశారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలనే ఉద్దేశంతో అధికారులకు, కాంట్రాక్టర్‌కి ఎప్పటికప్పుడు పలు సూచనలు చేస్తున్నా. మరో 2 నెలల్లో పూర్తి చేసే అవకాశం ఉంది.

- డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్, నెల్లూరు నగర ఎమ్మెల్యే

రెండు నెలల్లో పనులు పూర్తి చేస్తాం



మైపాడురోడ్డులో చేపట్టిన నాలుగులేన్ల సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. ప్రస్తుతం 50శాతం మేర రోడ్ల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. మిగిలిన 50 శాతం రోడ్డు నిర్మాణ పనులను మరో రెండు నెలల్లో పూర్తి చేసేందుకు ప్రయత్నం చేస్తున్నాం. వాహనాలు రాకపోకలకు ఇబ్బందులు లేకుండా నిర్మాణ పనులు చేపట్టాం. ప్రజలు కూడా సహకరించడం వల్లనే రోడ్డు నిర్మాణ పనుల్లో ఎక్కడా అలస్యం లేకుండా వేగవంతంగా చేపడుతున్నాం.

- సీహెచ్ చంద్రశేఖర్, ఏఈఈ, ఆర్‌అండ్‌బీ

నిర్దేశిత సమయం కన్నా ముందుగానే..

మైపాడురోడ్డు నిర్మాణ పనులను 2022 డిసెంబర్ 29వ తేదీన ప్రభుత్వం కాంట్రాక్టర్‌కు అప్పగించింది. ఈ రోడ్డు నిర్మాణ పనులను 2023 నవంబరు 28 తేదీలోపు కాంట్రాక్టర్ పూర్తి చేయాల్సి ఉంది. అయితే ఏడాది గడువు ఉన్నా కాంట్రాక్టర్ మాత్రం ఆరు నెలల్లోపు పూర్తి చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ప్రస్తుతం 1.2 కి.మీ మేర నాలుగులేన్ల సిమెంట్‌రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు.

అంబులెన్స్ సర్వీసుల్లో మెకానిక్ ఉద్యోగాలు

నెల్లూరు(అర్బన్): జిల్లాలో అరబిందో ఎమర్జెన్సీ 108, 104 అంబులెన్స్ సర్వీసుల్లో మెకానిక్‌లుగా పనిచేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఆ వాహనాల జిల్లా మేనేజర్ పవన్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణతతోపాటు ఐటీఐ, డీజిల్ మెకానిక్ పూర్తిచేసిన వారు అర్హులని తెలిపారు. ఈ నెల 20వ తేదీ లోపు నెల్లూరు పెద్దాస్పత్రిలోని దిశ పోలీస్‌స్టేషన్ పక్కనే ఉన్న తమ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని తెలిపారు.

'ఉమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛ' అవార్డులకు దరఖాస్తులు

నెల్లూరు సిటీ: 'ఉమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛ–2023' అవార్డులకు సంబంధించి మహిళలకు వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ హరిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పారిశుద్ధ్యం, ఘన పదార్థాల నిర్వహణ విభాగంలో వ్యక్తిగత, స్వయం సహాయం, చిన్న తరహా, సామాజిక మరుగుదొడ్ల నిర్వహణ, సెప్టిక్ ట్యాంకుల శుభ్రత, వ్యర్థాల శుద్ధీకరణ, చెత్త సేకరణ, చెత్తతో కళాకృతుల తయారీ, తడిచెత్త వినియోగం వంటి అంశాలపై కృషి చేస్తున్న మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 22వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అవార్డుకు ఎంపికైన మహిళలకు జూన్ 5వ తేదీన జరగనున్న ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో పురస్కారాలు అందజేస్తామని తెలిపారు. వివరాలకు 9676693707, 9542799072కు సంప్రదించాలని తెలిపారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి: రూ.70
సన్నవి: రూ.60
పండ్లు: రూ.30



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్):	109
లేయర్ (లైవ్):	75
బ్రాయిలర్ చికెన్:	194
బ్రాయిలర్ స్కిన్‌లెస్:	216
లేయర్ చికెన్:	128

• తెలంగాణ

గ్రూప్‌-1 ప్రిలిమ్స్‌ రద్దు!

- దీంతోపాటు ఏఈఈ, డీఏఓ పరీక్షలు కూడా..
- ప్రశ్నపత్రాల లీకేజీ నేపథ్యంలో టీఎస్‌పీఎస్సీ నిర్ణయం

సాక్షి, హైదరాబాద్‌: ప్రశ్నపత్రాల లీకేజీ నేపథ్యంలో గ్రూప్‌–1 ప్రిలిమినరీ పరీక్షను తెలంగాణ రాష్ట్ర పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ (టీఎస్‌పీఎస్సీ) రద్దు చేసింది. దీనితోపాటు గత రెండు నెలల్లో నిర్వహించిన 'అసిస్టెంట్‌ ఎగ్జిక్యూటివ్‌ ఇంజనీర్‌ (ఏఈఈ), డివిజనల్‌ అకౌంట్స్‌ ఆఫీసర్‌ (డీఏఓ)' పరీక్షలనూ రద్దు చేస్తున్నట్టు కమిషన్‌ శుక్రవారం ప్రకటించింది. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్‌) ప్రాథమిక నివేదికపై శుక్రవారం కమిషన్‌ ప్రత్యేక సమావేశం నిర్వహించింది. చైర్మన్‌, సభ్యులు, కార్యదర్శి పాల్గొన్న ఈ భేటీలో గ్రూప్‌–1 పరీక్షతో పాటు ఏఈఈ, డీఏఓ పరీక్షలపై చర్చించి.. వాటిని రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. ఇప్పటికే మార్చి ఐదున నిర్వహించిన అసిస్టెంట్‌ ఇంజనీర్‌ (ఏఈ) పరీక్షను రద్దు చేయడం తెలిసిందే. కాగా, గ్రూప్‌–1 ప్రిలిమినరీ పరీక్షను జూన్‌ 11వ తేదీన నిర్వహించాలని నిర్ణయించారు. మిగతా పరీక్షలను తిరిగి నిర్వహించే తేదీలను త్వరలో వెల్లడిస్తామని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి తెలిపారు.

చంద్రయాన్‌–3
'సామర్థ్య' పరీక్ష విజయవంతం

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చంద్రుడిపై పరిశోధనల కోసం ఈ ఏడాది జూన్‌ నెలాఖరులోపు చంద్రయాన్‌–3 ప్రయోగం నిర్వహించడానికి పకడ్బందీగా సన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగా బెంగళూరులోని యూఆర్‌ శాటిలైట్‌ సెంటర్‌లో మూడు మాడ్యూల్స్‌తో కూడిన చంద్రయాన్‌–3 ఉపగ్రహాన్ని తయారుచేసి అక్కడే దాని శక్తి సామర్థ్యాలను ఇటీవల పరీక్షించామని ఇస్రో గురువారం రాత్రి తన అధికారిక వెబ్‌సైట్‌లో పేర్కొంది. ఆర్బిటర్‌ మాడ్యూల్‌, ల్యాండర్‌ మాడ్యూల్‌, రోవర్‌ మాడ్యూల్‌ మూడు విభాగాలుగా చంద్రయాన్‌–3 ఉపగ్రహాన్ని రూపొందించారు. చంద్రుడిపై ఉన్న వాతావరణాన్ని కృత్రిమంగా సృష్టించి ఆ ఉపగ్రహాన్ని పరీక్షించారు. ప్రయోగ సమయంలో ఎదురయ్యే కఠినమైన కంపనం, ధ్వని వాతావరణాన్ని తట్టుకునే సామర్థ్యాన్ని ధ్రువీకరించుకునేందుకు అవసరమైన పరీక్షలను విజయవంతంగా నిర్వహించామని ఇస్రో వెల్లడించింది.



బెంగళూరులోని యూఆర్‌ రావు శాటిలైట్‌ సెంటర్‌లో చంద్రయాన్‌-3 ఉపగ్రహాన్ని పరీక్షిస్తున్న దృశ్యం

భారత్‌-ఫ్రాన్స్‌ అంతరిక్ష సంబంధాలు బలోపేతం

భారత్‌–ఫ్రాన్స్‌ దేశాల అంతరిక్ష సంబంధాలు మరింత బలోపేతం చేసేందుకు ఫ్రెంచి ప్రభుత్వం నిరంతరం పనిచేయడానికి అంగీకారం తెలిపిందని ఇస్రో తన వెబ్‌సైట్‌లో శుక్రవారం పేర్కొంది. ఫ్రాన్స్‌ విదేశాంగ మంత్రిత్వశాఖ సమన్వయంతో ఆ దేశ నేషనల్‌ అసెంబ్లీ విదేశీ వ్యవహారాల పార్లమెంట్‌ స్టాండింగ్‌ కమిటీ అధ్యక్షుడు జీన్‌–లూయిస్‌ బౌర్లాంగెస్‌ నేతృత్వంలో ఫ్రెంచి ప్రతినిధి బృందం గురువారం బెంగళూరులోని ఇస్రో ప్రధాన కార్యాలయాన్ని సందర్శించింది. ఇస్రోలోని హ్యూమన్‌ స్పేస్‌ ఫ్లైట్‌ సెంటర్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ ఆర్‌.ఉమా మహేశ్వరన్‌ ఆధ్వర్యంలో ఇస్రో, డాస్‌ ప్రతినిధి బృందం ఫ్రెంచి ప్రతినిధుల బృందానికి భారత అంతరిక్ష కార్యక్రమాల గురించి వివరించింది.

ఏపీ ఇన్‌ పార్లమెంట్‌

ఏపీలో తగిన యూరియా నిల్వలున్నాయి

లోక్‌సభలో కేంద్రం వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్‌లో 2022–23 రబీ సీజన్‌కు తగిన యూరియా నిల్వలు ఉన్నాయని కేంద్ర ఎరువులు రసాయనాలు శాఖ సహాయ మంత్రి భగవంత్‌ ఖుబా తెలిపారు. 2022–23 రబీ సీజన్‌కు గానూ 12–3–23 నాటికి 7.82 లక్షల మెట్రిక్‌ టన్నులు అవసరం ఉండగా 11.69 లక్షల మెట్రిక్‌ టన్నుల యూరియా అందుబాటులో ఉన్నట్లు వైఎస్సార్‌సీపీ సభ్యుడు పీవీ మిథున్‌రెడ్డి ప్రశ్నకు మంత్రి లిఖితపూర్వక సమాధానమిచ్చారు. 2022–23కు గానూ 12–3–23 నాటి లెక్కల ప్రకారం 15.82 లక్షల మెట్రిక్‌ టన్నులు అవసరం కాగా.. 17.76 లక్షల మెట్రిక్‌ టన్నులు అందుబాటులో ఉన్నట్లు కేంద్ర సహాయ మంత్రి వెల్లడించారు.

మంగళగిరి ఎయిమ్స్‌లో 960 పడకలు

ప్రధానమంత్రి స్వాస్థ్య సురక్ష యోజన పథకంలో భాగంగా మంగళగిరి ఎయిమ్స్‌ సహా 22 ఎయిమ్స్‌ల్లో 18,250 పడకలు మంజూరు చేశామని కేంద్ర ఆరోగ్యశాఖ సహాయ మంత్రి భారతి ప్రవీణ్‌ తెలిపారు. మంగళగిరి ఎయిమ్స్‌కు 960 బెడ్‌లు మంజూరు చేశామని వైఎస్సార్‌సీపీ సభ్యుడు వైఎస్‌ అవినాష్‌రెడ్డి ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

ఏపీలో మానవ అక్రమ రవాణా కేసుల తగ్గుదల

ఆంధ్రప్రదేశ్‌లో మానవ అక్రమ రవాణా కేసులు తగ్గుముఖం పడుతున్నాయని కేంద్ర మహిళ శిశు అభివృద్ధి శాఖ మంత్రి స్మృతి ఇరానీ తెలిపారు. 2019లో 245 కేసులు నమోదు కాగా 2020లో 171, 2021లో 168 కేసులు నమోదైనట్లు వైఎస్సార్‌సీపీ సభ్యురాలు చింతా అనూరాధ ప్రశ్నకు మంత్రి లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఎస్‌ఆర్‌బీ మెరుగుదల

ఆంధ్రప్రదేశ్‌లో సెక్స్‌ రేషియో ఎట్‌ బర్త్‌ (ఎస్‌ఆర్‌బీ) మెరుగుదలలో ఉందని కేంద్ర మహిళ, శిశు అభివృద్ధి శాఖ మంత్రి స్మృతి ఇరానీ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో 2014–15లో ఎస్‌ఆర్‌బీ 921 ఉండగా 2021–22 నాటికి 950కి చేరుకుందని వైఎస్సార్‌సీపీ సభ్యులు మార్గాని భరత్‌రామ్‌, సంజీవ్‌కుమార్‌ల ప్రశ్నకు ఆమె లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

సీఆర్‌ఐవైఎన్‌ ఏర్పాటు ప్రతిపాదన లేదు

ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో సెంట్రల్‌ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ యోగా, న్యాచురోపతి (సీఆర్‌ఐవైఎన్‌) ఏర్పాటు ప్రతిపాదన ఏదీలేదని కేంద్ర ఆయుష్‌ శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్‌ తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు బెల్లాన చంద్రశేఖర్‌ ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

ఏపీలో 12 సఖి నివాస్‌లు

ఆంధ్రప్రదేశ్‌లో వర్కింగ్‌ ఉమెన్‌ నిమిత్తం 12 సఖి నివాస్‌లు పనిచేస్తున్నాయని కేంద్ర మహిళ, శిశు అభివృద్ధి శాఖ మంత్రి స్మృతి ఇరానీ తెలిపారు. 2019–20లో 1.46 కోట్లు విడుదల చేశామని వైఎస్సార్‌సీపీ సభ్యుడు ఎన్‌. రెడ్డెప్ప ప్రశ్నకు ఆమె లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

డీఎంఎఫ్‌ ఏర్పాటు ప్రతిపాదన ఉంది

రక్షణ బలగాల ఆధునికీకరణ నిమిత్తం డిఫెన్స్‌ మోడరనైజేషన్‌ ఫండ్‌ (డీఎంఎఫ్‌) ఏర్పాటు ప్రతిపాదన ఉందని రక్షణ శాఖ సహాయ మంత్రి అజయ్‌ భట్‌ తెలిపారు. ఆర్థిక మంత్రిత్వశాఖతో సంప్రదింపులు చేసి ఫండ్‌ అమలుచేయడానికి తగిన యంత్రాంగం రూపొందిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ సభ్యుడు బాలశౌరి ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

రైల్వే అండర్‌బ్రిడ్జిలు నిర్మించండి
కేంద్రమంత్రి వైష్ణవ్‌కు ఎంపీ సత్యవతి విజ్ఞప్తి

సాక్షి, న్యూఢిల్లీ : అనకాపల్లి నియోజకవర్గంలోని మూలపేట నుంచి సత్యనారాయణపురం, లంకెలపాలెం సమీప రైల్వే లెవెల్‌ క్రాసింగ్‌ల వద్ద రైల్వే అండర్‌ బ్రిడ్జిలు నిర్మించాలని రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌కు వైఎస్సార్‌సీపీ ఎంపీ బీవీ సత్యవతి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రితో శుక్రవారం భేటీ అయిన ఎంపీ సత్యవతి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఆయా అండర్‌ బ్రిడ్జిల నిర్మాణం ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంటోందని ప్రజల ఇబ్బందులు గమనించి త్వరగా పూర్తిచేయాలని కోరారు. దక్షిణ కోస్తా రైల్వేజోన్‌ పనులు వేగవంతం చేయాలని కూడా కేంద్రమంత్రికి ఎంపీ సత్యవతి విజ్ఞప్తి చేశారు.

అంబేడ్కర్‌ స్మృతివనం పనుల వేగం పెంచండి



అంబేడ్కర్‌ స్మృతివనం నిర్మాణ పనులను సమీక్షిస్తున్న మంత్రులు ఆదిమూలపు, బొత్స, మేరుగు, కొట్టు

సాక్షి, అమరావతి: సమన్వయంతో పని చేసి అంబేడ్కర్‌ స్మృతివనం పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను మంత్రుల కమిటీ ఆదేశించింది. శుక్రవారం సచివాలయంలో అంబేడ్కర్‌ విగ్రహ నిర్మాణ కమిటీ చైర్మన్‌, మంత్రి మేరుగు నాగార్జున, ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్‌ సమీక్ష నిర్వహించారు. పురపాలక శాఖ ప్రిన్సిపల్‌ సెక్రటరీ శ్రీలక్ష్మి, సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి జయలక్ష్మి స్మృతివనం పనుల పురోగతిని మంత్రులకు వివరించారు. ఈ సందర్భంగా మేరుగు నాగార్జున మాట్లాడుతూ.. పనుల్లో ఎక్కడా లోపాలు జరగకుండా.. సీఎం జగన్‌ సూచనల ప్రకారం స్మృతివనాన్ని తీర్చిదిద్దాలని ఆదేశించారు. 125 అడుగుల అంబేడ్కర్‌ విగ్రహ నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని సూచించారు. ఢిల్లీలో ఇప్పటికే సిద్ధమైన విగ్రహం విడిభాగాలను రాష్ట్రానికి త్వరగా తెప్పించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్మృతివనంలో అంబేడ్కర్‌ జీవిత విశేషాలను తెలియజేసే శిల్పాలు, గ్రంథాలయంతో పాటు సందర్శకులకు అవసరమైన సౌకర్యాలను వేగంగా ఏర్పాటు చేయాలన్నారు. మ్యూజికల్‌ వాటర్‌ ఫౌంటెన్లు ఏర్పాటు చేయాలని, చుట్టూ ఉండే ఫుట్‌పాత్‌ను కూడా సీఎం సూచించిన విధంగా అందంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అధికారులు కె.హర్షవర్ధన్‌, అదితి సింగ్‌, నరసింహారావు, కేపీసీ ప్రాజెక్ట్స్‌ డైరెక్టర్‌ వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో బహుజనుల
సంక్షేమానికి పెద్దపీట

901వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: బడ్జెట్‌లో బహుజనుల సంక్షేమానికి పెద్దపీట వేసిన సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డికి తాము ఎప్పటికీ రుణపడి ఉంటామని, కులవాదంతో అధికారం కోసం వెంపర్లాడుతున్న బాబు అండ్‌ కో ఆటలు సాగవని గుర్తుంచుకుని మసలుకోవాలని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హెచ్చరించారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్‌ యాక్సిస్‌ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 901వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో శుక్రవారం పలువురు మాట్లాడారు. బహుజనులకు ఆర్థికంగా అండగా నిలుస్తూ సంక్షేమం, అభివృద్ధిని చేరువ చేస్తున్న ప్రభుత్వ చర్యలను చూసి కులవాదులకు అక్కసు పెరుగుతుందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా పేదలకు 30 లక్షలకు పైగా ఇళ్ల స్థలాలు మంజూరు చేసి గూడు కల్పించిన జగనన్న చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని చెప్పారు. అమరావతి పేరుతో 29 గ్రామాల్లో కులవాదులు చేస్తున్న పెట్టుబడి ఉద్యమం పూర్తిగా ముగిసిందని తెలిపారు. యువగళం పేరుతో అజ్ఞాని లోకేశ్‌ను చంద్రబాబు ప్రజల్లోకి పంపాడన్నారు. బాబు ఇకనైనా తప్పుడు యత్నాలు మానుకోకపోతే రాబోయే ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, ఇందుపల్లి సుభాషిణి, పులి దాసు తదితరులు పాల్గొన్నారు.

కాపు సంక్షేమ సేన రాష్ట్ర ఆర్గనైజింగ్‌ కార్యదర్శి శ్రీకాంత్‌ రాజీనామా

- వైఎస్సార్‌సీపీలో చేరిక
- బడ్జెట్‌లో కాపు సంక్షేమానికి రూ.4,887 కోట్ల కేటాయింపు
  సీఎం జగన్‌కు కృతజ్ఞతలు
- సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాపు కార్పొరేషన్‌ చైర్మన్‌ అడపా శేషు

సాక్షి, అమరావతి : కాపు సంక్షేమ సేన రాష్ట్ర ఆర్గనైజింగ్‌ కార్యదర్శి పెన్నేరు శ్రీకాంత్‌ శుక్రవారం తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను కాపు సంక్షేమ సేన రాష్ట్ర అధ్యక్షుడు చేగొండి హరిరామ జోగయ్యకు పంపినట్టు శ్రీకాంత్‌ ప్రకటించారు. ఏపీ కాపు సంక్షేమ అభివృద్ధి సంస్థ(కార్పొరేషన్‌) చైర్మన్‌ అడపా శేషగిరి సమక్షంలో వంద మంది అనుచరులతో శ్రీకాంత్‌ వైఎస్సార్‌సీపీలో చేరారు. కాపుల అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్న సీఎం జగన్‌కు మద్దతుగా నిలవాలన్న ఉద్దేశంతో తాను వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్టు చెప్పారు. కాపు సంక్షేమానికి 2023–24 బడ్జెట్‌లో రూ.4,887 కోట్లు కేటాయించి కాపుల మేలుకు చర్యలు చేపడుతున్న సీఎం జగన్‌కు కృతజ్ఞతలు చెబుతూ ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఏపీ కాపు కార్పొరేషన్‌ ప్రధాన కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో అడపా శేషగిరి మాట్లాడారు.

స్థానిక వార్తలు

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిరూపం : కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

నెల్లూరు(బృందావనం): భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు శ్రీత్యాగరాజ స్మరణోత్సవాలు ప్రతి రూపమని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. త్యాగరాజ స్మరణోత్సవాల నిర్వహణకు సంబంధించి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రశంసిస్తూ పంపిన లేఖను భిక్షాటన పూర్వక శ్రీత్యాగరాజ స్మరణోత్సవ సభ కమిటీ శాశ్వత కార్యదర్శి ఎనమండ్ర నాగదేవిప్రసాద్‌ శుక్రవారం విలేకరులకు అందజేశారు. ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా శ్రీత్యాగరాజ స్మరణోత్సవాలను నెల్లూరులో నిర్వహిస్తున్నారని తెలిసి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి లేఖను పంపారని తెలిపారు.

కాలువలో పడి వ్యక్తి మృతి



నాగేశ్వరరావు మృతదేహం

అనుమసముద్రంపేట: మండలంలోని చౌటభీమవరం గ్రామం వద్దనున్న సోమశిల ఉత్తరకాలువలో పడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు గ్రామానికి చెందిన పోలవరపు నాగేశ్వరరావు(49) పశువులను తోలుకుని గ్రామ సమీపంలోని కాలువ వద్దనున్న పొలాలకు వెళ్లాడు. కాలువ గట్టున వెళుతున్న సమయంలో జారి కాలువలో పడిపోయాడు. ఎంతకీ బయటకు రాకపోవడంతో ఆయన పక్కనున్న వృద్ధురాలు గ్రామంలోకి వెళ్లి గ్రామస్తులను తీసుకువచ్చి కాలువలోకి దిగి వెతికే సమయానికే నాగేశ్వరరావు మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై నరేష్‌ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు జిల్లా వైద్యశాలకు తరలించారు. నాగేశ్వరరావుకు భార్య సుభాషిణి, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు. కుటుంబ పెద్ద మృతితో వారు కన్నీరుమున్నీరుగా విలపించారు.

సిబ్బందికి ప్రత్యేక అలవెన్స్‌

నెల్లూరు(క్రైమ్‌): ఇంటర్మీడియట్‌ బందోబస్తు విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి రాష్ట్ర డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక అలవెన్స్‌ మంజూరు చేశారు. శుక్రవారం జిల్లాలోని డీఎస్పీలతో ఎస్పీ సీహెచ్‌ విజయారావు సమావేశం నిర్వహించారు. ఆయా సబ్‌డివిజన్ల పరిధిలో ఎంతమంది బందోబస్తు విధుల్లో ఉన్నారు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఒక్కొక్కరికి సుమారు రూ.750 చొప్పున ప్రత్యేక అలవెన్స్‌ ఇవ్వాలని సూచించినట్లు తెలిసింది.

ఆటాడిస్తా..



- జాతీయస్థాయి బ్యాడ్మింటన్‌ క్రీడాకారుడిగా రాణించిన వెంకటేష్‌
- ప్రస్తుతం కోచ్‌గా జాతీయ, అంతర్జాతీయస్థాయి క్రీడాకారులకు తర్ఫీదు

అతను సరదాగా ఆడిన ఆట జాతీయస్థాయిలో క్రీడాకారుడిగా గుర్తింపు తెచ్చింది. తర్వాత ఆట మీద పెంచుకున్న ఆసక్తి కోచ్‌గా మారేలా చేసింది. ఇందుకూరుపేట మండలం కొత్తూరు గ్రామానికి చెందిన గోవాడ వెంకటేష్‌ ఒకప్పుడు బ్యాడ్మింటన్‌ క్రీడాకారుడిగా జాతీయ స్థాయిలో రాణించాడు. ప్రస్తుతం కోచ్‌గా క్రీడాకారులను ఆడిస్తూ, ఉన్నతంగా తీర్చిదిద్దుతూ ఆటను భవిష్యత్‌ తరానికి అందిస్తున్నాడు. – నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట)



వెంకటేష్‌ శిక్షణలో వివిధ కేటగిరీల్లో పథకాలు సాధించిన క్రీడాకారులు(ఫైల్‌)

తన సొంతూరు ఇందుకూరుపేటలో సీనియర్‌ క్రీడాకారులతో బ్యాడ్మింటన్‌ ఆడడం వెంకటేష్‌ అలవాటు చేసుకున్నాడు. కొత్తూరు జెడ్పీ హైస్కూల్లో 8వ తరగతి చదివేటప్పుడు ట్యూషన్‌ మాస్టర్‌ సందానీబాషాతో సరదాగా బ్యాడ్మింటన్‌ ఆడడం ప్రారంభించాడు. అలా అతనికి ఆటపై మక్కువ పెరిగింది. బ్యాడ్మింటన్‌ సాధన చేసి రెండేళ్లలో ఉత్తమ క్రీడాకారుడిగా ఎదిగాడు. 2008లో నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జిల్లా టోర్నమెంట్‌లో అండర్‌–16 విభాగంలో ఆడి సింగిల్స్‌, డబుల్స్‌ విన్నర్స్‌గా నిలిచాడు. మొదటిసారి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. దీంతో రాష్ట్రస్థాయి పోటీలకు పాల్గొనే అవకాశం దక్కింది. జిల్లా టోర్నమెంట్‌లో వెంకటేష్‌ బ్యాడ్మింటన్‌ ఆట తీరు జిల్లా బ్యాడ్మింటన్‌ అసోసియేషన్‌ ప్రతినిధి ముక్కాల ద్వారకానాథ్‌, రాకేష్‌చౌదరి దృష్టిలో పడింది. వారు అతని గురించి వాకబు చేసి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వెంకటేష్‌ను చదువుల్లో, ఆటల్లో ఆర్థికంగా ప్రోత్సహించారు. వెంకటేష్‌కు కోచ్‌ ప్రదీప్‌ బ్యాడ్మింటన్‌లో శిక్షణ ఇచ్చి ఉత్తమ క్రీడాకారుడిగా తీర్చిదిద్దారు. తర్వాత 2013, 2014, 2015 సంవత్సరాల్లో అంతర్‌ విశ్వవిద్యాలయాల చాంపియన్‌గా, అలాగే స్టేట్‌గా చాంపియన్‌గా ఒకసారి నిలిచారు. దీంతో బ్యాడ్మింటన్‌ అసోసియేషన్‌ అతనిని కోచ్‌గా నియమించింది. ప్రస్తుతం వెంకటేష్‌ పాఠశాల స్థాయి నుంచే క్రీడాకారులను గుర్తించి జాతీయస్థాయిలో వారిని తీర్చిదిద్దుతున్నాడు.



బ్యాడ్మింటన్‌లో శిక్షణ ఇస్తున్న వెంకటేష్‌


క్రీడాకారులను తీర్చిదిద్దితూ..

ఏడేళ్లుగా నెల్లూరు జిల్లా క్రీడాప్రాధికార సంస్థలో కోచ్‌గా పనిచేస్తూ ఎందరో క్రీడాకారులను తీర్చిదిద్దారు. వారిలో ఒక అంతర్జాతీయ క్రీడాకారుడు అండర్‌–13 నేషనల్‌ లెవల్‌లో సిల్వర్‌ మెడల్‌, ఏపీ స్టేట్‌ లెవల్‌లో గోల్డ్‌, సిల్వర్‌, బ్రాంజ్‌ మెడల్స్‌ సాధించాడు. ఏపీ సబ్‌ జూనియర్‌ టీమ్‌ కోచ్‌గా పనిచేయడంతోపాటు జాతీయస్థాయిలో 20 మంది, రాష్ట్రస్థాయిలో 15 మంది క్రీడాకారులకు, జిల్లా స్థాయిలో పలువురికి వెంకటేష్‌ శిక్షణ ఇచ్చారు. బీసీఏ విద్యతోపాటు క్రీడారంగంలో పీజీ డిప్లమో ఇన్‌బ్యాడ్మింటన్‌ పీఈఎఫ్‌ఐ సర్టిఫికెట్‌ కోర్స్‌ చేశారు.

కోచింగ్‌..

ప్రతి రోజూ ఉదయం 5 నుంచి 7 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్‌ కాంప్లెక్స్‌ ఇండోర్‌ స్టేడియంలో శిక్షణ ఉంటుంది. వివరాలకు సంప్రదించాల్సిన ఫోన్‌నంబర్లు కోచ్‌ వెంకటేష్‌ : 94944 92717, చీఫ్‌ కోచ్‌ ఆర్‌కే యతిరాజ్‌ : 91211 06835


చిన్నప్పటి నుంచి ఇక్కడే సాధన



2014లో ఆరేళ్ల వయస్సులో బ్యాడ్మింటన్‌ సాధన చేయడం ప్రారంభించాను. ఇప్పుడు నా వయస్సు 14ఏళ్లు. 2023లో సబ్‌ జూనియర్‌ నేషనల్స్‌లో విజేతగా నిలిచాను. 2019లో ఏపీ స్టేట్‌ విన్నర్‌గా నిలిచాను. కోచ్‌ వెంకటేష్‌ ఇచ్చిన శిక్షణ, నేర్పిన మెలకువలు ఎంతో ఉపయోగపడుతున్నాయి. రాబోయే రోజుల్లో మరిన్ని హైలెవల్‌ టోర్నమెంట్లు ఆడి పతకాలు సాధిస్తాను.

– కె.మహేంద్ర, నేషనల్‌ చాంపియన్‌

శిక్షణ బాగుంటుంది



ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్‌ కాంప్లెక్స్‌లో శిక్షణ బాగుంటుంది. ఆరేళ్ల నుంచి సాధన చేస్తున్నాం. ఇప్పటివరకు అండర్‌–11లో రాష్ట్రస్థాయి విన్నర్స్‌గా అత్యుత్తమ ఫలితాలు సాధించాం. నిరంతర సాధనతో రాబోయే రోజుల్లో టోర్నమెంట్లలో పాల్గొని మంచి పేరు తెస్తాం.

– వశిష్ట, మహేంద్ర, రాష్ట్రస్థాయి క్రీడాకారులు

ఆటను ఇష్టంగా మార్చుకున్నా

బ్యాడ్మింటన్‌ కాస్ట్లీ గేమ్‌. పేద, మధ్య తరగతి క్రీడాకారుల కష్టాలు తెలుసు. క్రీడాకారుడిగా నేను పడ్డ కష్టాలను ఇప్పటి క్రీడాకారులు పడకుండా చేతనైన సాయం చేస్తున్నా. మారుతున్న కాలంతోపాటు వచ్చే నూతన పద్ధతుల్లో శిక్షణ ఇస్తున్నా. దేశం గర్వించదగ్గ స్థాయిలో క్రీడాకారులు నెల్లూరు నుంచి ఇంకా ఎక్కువ మంది తయారవుతారు.

– వెంకటేష్‌, బ్యాడ్మింటన్‌ కోచ్‌

త్యాగరాజ స్మరణోత్సవాలు
ఘనంగా నిర్వహిస్తాం



వేణుగాన విద్వాంసురాలు సిక్కిల్‌ మాలచంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న ఎస్పీ చరణ్‌



కల్యాణరాముడి అలంకారంలో స్వామివారు

- తండ్రి మాట నెరవేరుస్తా
- ఎస్పీ చరణ్‌

నెల్లూరు(బృందావనం): భవిష్యత్‌లో శ్రీత్యాగరాజ స్మరణోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని, తన తాత శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి, తండ్రి ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంలకు పేరు ప్రతిష్టలు తీసుకొస్తానని ప్రముఖ సినీ గాయకుడు ఎస్పీ చరణ్‌ తెలిపారు. తన తండ్రి ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కోరిక మేరకు 60వ శ్రీత్యాగరాజ స్మరణోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు తనవంతు తోడ్పాటు అందిస్తానని తెలిపారు. భిక్షాటనా పూర్వక శ్రీత్యాగరాజ స్మరణోత్సవసభ ఆధ్వర్యంలో కమిటీ పర్యవేక్షణలో పురమందిరం ప్రాంగణంలో జరుగుతున్న 58వ స్మరణోత్సవాల్లో 6వ రోజు శుక్రవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఎస్పీ చరణ్‌ పాల్గొని గాయకులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి బాలసుబ్రహ్మణ్యం ఐదేళ్ల క్రితం స్మరణోత్సవాల నిర్వాహకుడు ఎనమండ్ర నాగదేవిప్రసాద్‌కు ఇచ్చిన మాట ప్రకారం 2025 సంవత్సరంలో 60వ శ్రీత్యాగరాజస్వామి స్మరణోత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. స్మరణోత్సవాలను నిర్వహించడంతోపాటు ఔత్సాహిక కళాకారులు, సంగీత విద్వాంసులను ఆదరించడం ఆనందం కలిగిస్తోందన్నారు.

సిక్కిల్‌ మాలచంద్రశేఖర్‌ వేణుగానం

స్మరణోత్సవాల్లో శుక్రవారం స్వామివారు కల్యాణరాముడి అలంకారంలో భక్తులను కటాక్షించారు. రాత్రి చెన్నైకి చెందిన ప్రముఖ వేణుగాన విద్వాంసురాలు సిక్కిల్‌ మాలచంద్రశేఖర్‌ తన వేణుగానంతో అలరించారు. ఆ వేణుగానానికి వి.వి.శ్రీనివాసరావు (వయోలిన్‌), అనంతకృష్ణన్‌(మృదంగం), తిరుచ్చి మురళి(ఘటం) వాద్య సహకారం అందించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కథకులు నంది వసంతకుమారి భాగవతారిణిచే తులసీజలంధర, వై.వెంకటేశ్వర్లు భాగవతార్‌చే గజేంద్రమోక్షం హరికథగానం చేశారు. సాయంత్రం ఔత్సాహిక కళాకారులతో గాత్ర కచేరీలు ఉత్సాహంగా సాగాయి. కమిటీ అధ్యక్ష, శాశ్వత కార్యదర్శులు చతుర్వేదుల శ్రీరామమూర్తి, ఎనమండ్ర నాగదేవిప్రసాద్‌, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్‌ పోటీలు ప్రారంభం



బాల్‌బ్యాడ్మింటన్‌ పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

కావలిరూరల్‌: పట్టణంలోని డీబీఎస్‌ ఇంజినీరింగ్‌ కళాశాలలో శుక్రవారం రాష్ట్రస్థాయి ఇంటర్‌ డిస్ట్రిక్ట్‌ 7వ జూనియర్‌ బాలబాలికల బాల్‌ బ్యాడ్మింటన్‌ పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఎస్పీ ఎం.వెంకటరమణ మాట్లాడుతూ క్రీడలు శారీరక దారుఢ్యాన్ని, మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని తెలిపారు. రాష్ట్ర బాల్‌బ్యాడ్మింటన్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు వి.జయశంకర్‌ మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీ వరకు రాష్ట్రస్థాయి జూనియర్‌ ఇంటర్‌ డిస్ట్రిక్ట్‌ బాల్‌ బ్యాడ్మింటన్‌ పోటీలు కావలిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల క్రీడాకారులు పాల్గొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్‌ దామిశెట్టి సుధీర్‌నాయుడు, రాష్ట్ర బాల్‌బ్యాడ్మింటన్‌ అసోసియేషన్‌ కార్యదర్శి ఆర్‌.వెంకటరావు, ఏఎంసీ చైర్మన్‌ సన్నిబోయిన ప్రసాద్‌, ఎంపీపీ కొండమ్మ, రూరల్‌ సీఐ ఎం.రాజేష్‌, ట్రెజరర్‌ ఆదినారాయణ, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
నెల్లూరు
శనివారం ॥ 18-3-2023

కుర్రాళ్లు వినరు.
బైక్ ఎక్కి తుర్రుమంటారు.
భర్తలకు నిర్లక్ష్యం.
హెల్మెట్ లేకుండానే బయలుదేరుతారు.
ఇంటి మగవారి అసురక్షిత ప్రయాణం
స్త్రీలకు ఎప్పుడూ ఆందోళనకరమే.
ప్రతి ఇంట్లోని స్త్రీలు
ఆ ఇంటి మగవారికి రాఘవేంద్ర కుమార్‌ను చూపాలి.
స్నేహితుణ్ణి ప్రమాదంలో కోల్పోయిన అతను
సొంత డబ్బుతో ఇప్పటికి 56,000 హెల్మెట్లు పంచాడు.
పురుషులైనా స్త్రీలైనా హెల్మెట్ లేకుండా బండెక్కారంటే
ఇంటి మీదకు ముప్పు తెచ్చినట్టే అంటాడు రాఘవేంద్ర.
అతను చెప్పేది వినండి.


రాఘవేంద్ర

● హెల్మెట్ మ్యాన్ ఆఫ్ ఇండియా

మీ పిల్లలకు ఇతన్ని చూపండి

'ఒంటి మీద ఎక్కడా దెబ్బ లేదు. తల ఒక్క దానికే తగిలింది' అని అయినవారిని కోల్పోయి ఏడ్చేవారు ఎందరో ఉన్నారు. ఆ తలకు దెబ్బ తగలని రీతిలో జాగ్రత్త తీసుకుని ఉంటే వారంతా బతికేవారు. హెల్మెట్ వాడితే బతికేవారు.

చట్టాలు ఎన్ని చెప్పినా, నిబంధనలు విధించినా జీవితాన్ని సీరియస్‌గా తీసుకోని వారు ఎప్పుడూ ఉంటారు. వారు ఎక్కడో వేరే కుటుంబాలలో ఉంటారనుకోవద్దు. మన కుటుంబాల్లో కూడా ఉంటారు. కాలేజీకి వచ్చిన కొడుకు, ఉద్యోగానికి వెళ్లే భర్త, ట్రయినింగ్‌లో ఉన్న కూతురు.. వీరు కూడా 'ఆ.. ఏముందిలే' అనుకుని హెల్మెట్ వాడకుండా ఉండొచ్చు.

అలాంటి వారు తన కంట పడితే ఊరుకోడు రాఘవేంద్ర కుమార్ (36). ఇతణ్ణి అందరూ ఇప్పుడు 'హెల్మెట్ మ్యాన్ ఆఫ్ ఇండియా' అంటారు. నోయిడాలో నివాసం ఉండే ఇతను ఉద్యోగం వదిలేశాడు. ఇతర పనులు మానేశాడు. కేవలం హెల్మెట్‌కు సంబంధించిన చైతన్యం కోసం పని చేస్తున్నాడు. అతడు రోజూ చేసే పని కారు వేసుకుని, అందులో కొన్ని హెల్మెట్లు పడేసుకుని నోయిడా ఆగ్రాల మధ్య ఉండే ఆరు లేన్ల యమునా ఎక్స్‌ప్రెస్‌కు చేరుకుంటాడు. ఆ దారి మీద బైక్ వేసుకుని హెల్మెట్ లేకుండా ఎవరైనా వెళుతుంటే వారిని వెంబడించి ఆపుతాడు. హెల్మెట్ వాడకపోతే ఉండే ప్రమాదం గురించి చెప్పి ఉచితంగా హెల్మెట్ ఇచ్చి పంపుతాడు.

'2014 నుంచి నుంచి నేను హెల్మెట్‌లు పంచుతున్నాను. ఇప్పటికి 56 వేల హెల్మెట్లు పంచాను. నేను పంచిన రోజునో ఆ తర్వాత ఐదారు రోజుల్లోనో ప్రమాదానికి గురై నేనిచ్చిన హెల్మెట్ వల్ల ప్రాణాలు కాపాడుకున్న వారు 30 మంది ఉన్నారు. వారంతా ఎంతో సంతోషంతో కృతజ్ఞతతో నాకు ఫోన్ చేసి తాము ప్రాణాలతో ఉండటానికి కారణం నేనేనని చెబుతారు. చాలామందికి భారీ యాక్సిడెంట్లు అయ్యి కాళ్లు చేతులు విరిగినా తల మాత్రం ఏమీ కాకపోవడంతో బతికిపోయారు' అంటాడు రాఘవేంద్ర కుమార్.

అయితే అతనికి కూడా హెల్మెట్ విలువ ప్రాణ స్నేహితుడు మరణించాకే తెలిసింది. బిహార్‌కు చెందిన రాఘవేంద్ర కుమార్ 2009లో నోయిడా వచ్చి లా కోర్సులో



చేరాడు. అదే బిహార్ నుంచి ఇంజినీరింగ్ చేయడానికి వచ్చి కృష్ణకుమార్ అతని రూమ్మేట్ అయ్యారు. ఇద్దరూ ప్రాణ స్నేహితులు అయ్యారు. కాని 2014లో కొత్తగా వేసిన యమున ఎక్స్‌ప్రెస్ వే మీద హెల్మెట్ లేకుండా వెళుతూ కృష్ణకుమార్ యాక్సిడెంట్‌కు లోనయ్యాడు. ఒంటి మీద ఒక్క దెబ్బ లేదు. తలకే తగిలింది. మరణించాడు. 'వాళ్లింట్లో వాళ్లకి నా స్నేహితుడు ఒక్కగానొక్క కొడుకు కావడంతో వాడి అమ్మా నాన్నల గుండెలు పగిలిపోయాయి. హెల్మెట్ ఉంటే బతికేవాడు కదా అన్న బాధ ఇప్పటికీ వదల్లేదు నన్ను' అంటాడు రాఘవేంద్ర.

అప్పటి నుంచి అతడు ఒక ఉద్యమంగా హెల్మెట్లు పంచుతున్నాడు. భార్య కొత్తల్లో సహకరించింది. కాని రాఘవేంద్ర కుమార్ దాదాపు తన ఆస్తులన్నీ అమ్మి ఇప్పటికి రెండు కోట్ల వరకు ఖర్చు చేసి హెల్మెట్లు పంచాడు. 'ఉన్నదంతా ఊడ్చేశాను. పర్వాలేదు. బిహార్‌లోని నా సొంత పల్లెకు వెళ్లిపోతాను' అని ఇటీవల అతను ప్రకటించాడు.

కాని అది పైమాటే. తనకు సరైన ప్రోత్సాహం లభిస్తే దేశంలో హెల్మెట్ల బ్యాంకులు తెరవాలని ఎవరైనా సరే అరువు తీసుకుని వెళ్లి వాడుకునేలా హెల్మెట్లు అందుబాటులో ఉంచాలని అతని కోరిక. '4 ఏళ్లు పైబడిన పిల్లలకు హెల్మెట్లు తప్పనిసరి చేయాలని నేను సుప్రీం కోర్టులో పిల్ వేశాను. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కూడా కలిశాను' అంటాడు రాఘవేంద్ర. 'ప్రాణం పోతే ఏం చేసినా తిరిగి రాదు' అంటాడు.

హెల్మెట్‌ను వాడటానికి ఇష్టపడని ప్రతి ఒక్కరికి రాఘవేంద్ర చెబుతున్న విషయం అర్థం కావాలి. ప్రాణం ఉంటే లోకం ఉంటుంది.

హ్యాపీ పేరెంటింగ్

వసపిట్ట పాఠాలు


కృష్ణమాధురి

తల్లిదండ్రులుగా పిల్లలను చూసుకోవాల్సిన విధానాన్ని, తల్లిగా తన అనుభవాన్ని కళ్లకు కడుతూ యూ ట్యూబర్‌గా రాణిస్తోంది హైదరాబాద్ కొండాపూర్‌లో ఉంటున్న చిలుకూరి కృష్ణ మాధురి, నాలుగు, ఏడాదిన్నర వయసున్న పిల్లలతో కలిసి, తన స్వీయ అనుభవాలను షేర్ చేస్తుంటుంది. మాధురి మూడేళ్లుగా చేస్తున్న ఈ ప్రయత్నాలు... పిల్లల పెంపకంలో తను తీసుకునే జాగ్రత్తలు ఎంతోమంది తల్లులకు పాఠాలు అవుతున్నాయి. ఈ విషయాల గురించి మాధురి మాట్లాడుతూ ...

''నేను పుట్టి పెరిగింది రాజమండ్రిలో. మావారిది గుంటూరు. మా వారి ఉద్యోగరీత్యా బెంగళూరులో ఉండేవాళ్లం. సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా ఉన్న నేను పిల్లల పుట్టడంతో ఇంటి దగ్గరే ఉండిపోయాను. పిల్లలపై తపన, వారి ఆరోగ్య జాగ్రత్తలు, పెంపకం విషయాలన్నీ తల్లిగా నాకు ప్రతిరోజూ ఓ పాఠమే. వీటిని నలుగురితో పంచుకుంటే కొంత మంది తల్లులకైనా ఉపయోగపడుతుంది కదా అని సరదాగా వీడియోలు తీసి, యూ ట్యూబ్‌లో పోస్ట్ చేసేదాన్ని.

వాయిస్ ఆఫ్ వసపిట్ట

పిల్లల అల్లరి మాటలకు పెద్దవాళ్లు ముద్దుగా పెట్టే పేరు వసపిట్ట. నలుగురిలో ప్రత్యేకంగా ఉండాలని చిన్నప్పటి నుంచి కాస్త ఎక్కువగా మాట్లాడేదాన్ని. అందుకే, అందరూ నన్ను వసపిట్ట అని పిలిచేవారు. దీంతో ఛానెల్‌కి ఇదే పేరు బాగుంటుందని ఎంచుకున్నాను. మూడేళ్లు అవుతోంది ఇది స్టార్ట్ చేసి. బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వచ్చాక నా పోస్టులు మరిన్ని పెరిగాయి.



పెంపకాన్ని పరిచయం చేస్తూ..

అమ్మ తన పిల్లలను ఏ విధంగా పెంచుతుందనే విషయాల గురించి వెతికితే తెలుగులో ఎక్కువ బ్లాగర్స్ లేరు. ఉన్నా, వివరంగా చెప్పేవారు లేరు. పిల్లల పెంపకం అనగానే చాలా వరకు డాక్టర్లు, డైటీషియన్లు కనిపిస్తారు. వాళ్లు చెప్పేవి అందరూ ఆచరణలో పెడుతున్నారో లేదో తెలియదు. నేను డాక్టర్ దగ్గరకు పిల్లలను తీసుకెళ్లినప్పుడు, అక్కడ వారిచ్చిన మందులు, జాగ్రత్తల నుంచి అన్నీ నా ఛానెల్ ద్వారా పరిచయం చేస్తుంటాను.

రోజువారి పనులు

చిన్న పిల్లలున్న ఇల్లు ఎలా ఉంటుందో తల్లులందరికీ అనుభవమే. ఇల్లు పీకి పందిరేస్తారు అంటుంటారు. ఇలాంటప్పుడు చిన్నపిల్లలకు క్రమశిక్షణ ఎలా అలవాటు చేయాలి, దుమ్ము, కాలుష్యం నుంచి వారిని ఎలా కాపాడాలి, టీవీ చూడకుండా తినడం ఎలా అలవాటు చేయాలి, స్క్రీన్ టైమ్ ఎందుకు తగ్గించాలి.. ఇలాంటివి పిల్లలను ఇన్‌వాల్వ్ చేసి చెప్పడం వల్ల చాలా మంది కనెక్ట్ అయ్యారు. అంతేకాదు, వాళ్లంతట వాళ్లు పనులు చేసుకోవడం, వంటలో సాయం చేయడం.. వంటివి పిల్లలకు పెద్దవాళ్లు అలవాటు చేయాలి. వీటిని మా పిల్లలను చూపిస్తూ 'హ్యాపీ పేరెంటింగ్' అనేది తెలియజేయాలనుకున్నాను. అదే చేస్తున్నాను.

ఆనందకరమైన లక్ష్యం

మదర్ హుడ్, ఫాదర్ హుడ్ ఎంజాయ్ చేస్తూ పిల్లలు కూడా మంచి ఫీలింగ్‌తో పెరగాలనేది నా ఆలోచన. మేం సమస్యలను ఎలా అధిగమిస్తున్నామో కూడా చూపిస్తున్నాను. వీటిని చూడటానికి నాలుగు లక్షలకు పైగా వీక్షకులున్నారు. వీరిలో పిల్లలున్నవారు 70 శాతం మంది ఉన్నారు. నా వీడియోలు చూసి తాము కూడా బ్లాగ్స్ చేస్తున్నామని కొందరు చెబుతుంటారు.

ఆరోగ్య జాగ్రత్తలు...

వీక్షకులలో చాలా మంది డాక్టరు చెప్పే జాగ్రత్తలు, కిడ్స్ ఫుడ్ గురించి సలహాలు సూచనలు అడుగుతుంటారు. పిల్లలు సరిగా తినరు అనేది పెద్దలు ప్రతిసారి చెబుతుంటారు. కానీ, ఎందుకు తినరు, ఎలా తింటారు.. అనే వివరాలను మా పిల్లలను ఉదాహరణగా చూపిస్తూ వివరిస్తుంటాను. వివిధ సమయాలలో పిల్లల ప్రవర్తన, మనం వారితో మాట్లాడటం, ప్రాక్టికల్‌గా చేస్తూ చెబుతుంటాను. పిల్లలు కూడా ఈ విధానాన్ని బాగా ఇష్టపడుతున్నారు. మా పిల్లలకు ఓ సారి ర్యాషెష్ వచ్చాయి. వాటిని ప్రాక్టికల్‌గా చూపించి, డాక్టరు చెప్పిన సూచనలతో పాటు, నేను స్వయంగా ఎలాంటి కేర్ తీసుకుంటున్నానో చూపించాను. అలాగే.. డెంటల్ ట్రీట్‌మెంట్, గర్భిణిగా ఉన్నప్పుడు, తల్లిపాల ప్రాముఖ్యత.. ఆ సమయాల్లో నేనెలాంటి జాగ్రత్తలు తీసుకున్నాను.. మరికొన్ని ఇతరుల ద్వారా సేకరించిన సూచనలూ ఇస్తుంటాను. మా నాన్న రైల్వేలో ఉద్యోగి. చిన్నప్పటి నుంచి కుటుంబంలో ప్రతి విషయంలో నా అభిప్రాయాన్ని కూడా అడిగేవారు. అలా వారి నుంచే నాకు నా పిల్లల పెంపకాన్ని మరింతగా నలుగురికి తెలియజేయాలనే ఆలోచన పెరుగుతూ వచ్చింది'' అని తల్లిగా తన అనుభవ పాఠాలను ఆనందంగా వివరించారు మాధురి.

– నిర్మలారెడ్డి

బ్యూటిప్స్



● టేబుల్ స్పూన్ పెసలను రాత్రంతా నానబెట్టి ఉదయం మెత్తగా గ్రైండ్ చేసి అందులో అర టీ స్పూన్ నెయ్యి లేదా పాలు వేసి కలిపి ముఖానికి పట్టించి మర్దన చేసి పది నిమిషాల సేపు మిశ్రమాన్ని ముఖం మీద ఉంచాలి. ఈ ప్యాక్ పూర్తిగా ఆరిన తర్వాత గోరువెచ్చటి నీటితో కడగాలి. ఇలా చేస్తే పొడిబారిన చర్మం ఆరోగ్యంగా, నునుపుగా మారుతుంది. ఆయిల్ స్కిన్ వాళ్లయితే పెసర పేస్ట్‌లో కొద్దిగా మజ్జిగ లేదా పన్నీరు కలుపుకోవాలి.





● ఎండకు కమిలిపోయిన చర్మం తిరిగి మామూలు కావాలంటే... పైన చెప్పుకున్న పెసల పేస్టులో చల్లటి పెరుగు లేదా కలబంద పేస్టు కలిపి ముఖానికి, చేతులకు, పాదాలకు పట్టించి ఐదు నిమిషాల సేపు మర్దన చేయాలి. ఆరిపోయిన తర్వాత చల్లటి నీటితో శుభ్రం చేయాలి.

● హెయిర్ ఫాల్ తగ్గాలంటే... రాత్రంతా నానబెట్టిన పెసలను గ్రైండ్ చేసి అందులో కోడిగుడ్డు సొన, టేబుల్ స్పూన్ నిమ్మరసం, కప్పు పెరుగు కలిపి చిక్కటి పేస్టు చేయాలి. ఈ మిశ్రమాన్ని జుట్టు కుదుళ్లకు పట్టించి 15నిమిషాల తర్వాత తలస్నానం చేయాలి. ఈ మూంగ్‌దాల్ ప్యాక్‌ను నూనె రాసిన జుట్టుకు పట్టించకూడదు. షాంపూతో తలస్నానం చేసి ఆరిన తర్వాత మాత్రమే వేయాలి.

● 'ఆడపిల్ల'కు స్వాగతం

మా ఇంటి మహాలక్ష్మి

ఆడపిల్లపుట్టిందని సంబరం చేశారు.
ఇంట్లోకి పూలతో రహదారి పరిచారు.
చిట్టి పాదాల పారాణి ముద్రలు వేశారు.
అమ్మాయి పుడితే ఇలా స్వాగతం పలకండి.

'ఆడదే ఆధారం... మన కథ ఆడనే ఆరంభం...' అంటూ పాడుకునే నేల మనది. ఆడపిల్ల పుట్టగానే గొంతులో వడ్ల గింజలు వేసిన నేల కూడా ఇది. తల్లి గర్భంలోనే శిశువును గుర్తించి పుట్టకముందే ప్రాణం తీస్తున్న పాపాలకూ కొదవ లేదు. ఇక ఆడపిల్లను కన్నతల్లికి ఎదురయ్యే కష్టాలను ఎంత చెప్పుకున్నా తక్కువే. ఆడపిల్ల పుట్టింది... అనగానే కోడలిపై చిర్రుబుర్రులాడే అత్తలు, భార్య–బిడ్డల ముఖం చూడని మగవాళ్లు ఉన్న సమాజం మనది. ఇన్ని దారుణాల మధ్య ఓ సంతోషవీచిక వెల్లివిరిసింది. పుట్టింది ఆడపిల్ల అని తెలియనే పండుగ చేసుకున్నారు. ఊరూ వాడా అందరినీ పిలిచి వేడుక చేసుకున్నారు. అమ్మమ్మగారింట్లో రెండు నెలలు పూర్తి చేసుకున్న బిడ్డ మూడవ నెల నానమ్మ దగ్గరకు ప్రయాణమైంది. ఆ బిడ్డనెత్తుకుని అత్తగారింటికి వచ్చిన తల్లికి పూలబాట పరిచారు అత్తింటివాళ్లు. పాపకు ఘన స్వాగతం పలికారు. ఆడబిడ్డ పుట్టడం అంటే ఇంట్లోకి లక్ష్మీదేవి రావడమేనన్నారు. ఆదర్శంగా నిలిచిన కుటుంబం తెలంగాణ, మహబూబాబాద్ జిల్లాలో ఉంది. కేసముద్రం మండలం, తాళ్లపూసపల్లి గ్రామానికి చెందిన పొడగంటి శ్రీనివాసాచారి, భద్రకాళి దంపతుల ఆదర్శవంతమైన ఆత్మీయత ఇది.


నట్టింట పాదముద్రలు వేయిస్తూ...

పాపాయిని ఎత్తుకున్న నానమ్మ




పాపాయితో అమ్మానాన్నలు సంహిత, సాయికిరణ్

పాపాయి కోసం పూజలు

కోడలు గర్భిణి అని తెలియగానే మగ పిల్లవాడు పుట్టాలని అనుకుంటారు. కానీ భద్రకాళి కుటుంబీకులు మాత్రం ఆడపిల్ల కావాలని పూజలు చేశారు. వాళ్ల పెద్దకొడుకు సాయి కిరణ్‌కు సిరిసిల్ల పట్టణానికి చెందిన సంహితతో రెండు సంవత్సరాల క్రితం వివాహమైంది. సంహిత నెలతప్పినప్పటి నుంచి భద్రకాళితోపాటు ఆమె తోడికోడలు సుమ, మరదలు రమ్య కూడా ఆడపిల్లలు పుట్టాలని వ్రతాలు, పూజలు చేశారు. వాళ్లందరికీ మగపిల్లలే. ఈ తరంలోనైనా ఇంట్లో ఆడపిల్ల కావాలని వాళ్ల కోరిక. ప్రసవం రోజు వరంగల్‌లో ఆసుపత్రికి ఇంటిల్లిపాది తరలి వెళ్లారు. ఆడపిల్ల పుట్టిందని తెలియగానే సంతోషంగా కేకలు వేస్తూ, హాస్పిటల్‌లో అందరికీ స్వీట్లు పంచిపెట్టారు.

అపూర్వ స్వాగతం

కోడలు పుట్టింటికి వచ్చిన రోజు ఇంటిని పూలతో అలంకరించారు. ముత్తయిదువలతో స్వాగతం పలికారు. చిన్నపాప కాళ్లకు పారాణి రాసి తొలి అడుగుల గుర్తులు నట్టింట్లో ముద్రించుకున్నారు. ఆ అడుగులను కళ్లకు అద్దుకున్నారు. ఆ జ్ఞాపకం కలకాలం నిలిచి ఉండడానికి ఫొటోలు తీశారు.

నా కోరిక తీరింది

నాకు చిన్నప్పటి నుండి ఆడపిల్లలంటే ఇష్టం. మా వారు కూడా ఆడపిల్ల ఉన్న ఇంటి అందమే వేరు అంటూ ఉంటారు. అందుకోసమే మా ఇంటి చుట్టుపక్కల ఉన్న ఆడ పిల్లలను ప్రతి పండుగకు పిలుస్తాం. వారు చేసే సందడి చూసి సంబుర పడుతాం. మా ఇంట్లో ఆడపిల్ల ఉండాలనే కోరిక నెరవేరింది. అందుకోసమే అలా స్వాగతం పలికాం.

– భద్రకాళి, పాపాయి నానమ్మ

– ఈరగాని భిక్షం, సాక్షి, మహబూబాబాద్

● కేరెంటింగ్

లాలన... పాలన



ఈ రోజుల్లో పిల్లలు పెద్దలు అనే తేడా లేకుండా అందరూ కూడా ఒత్తిడితో జీవిస్తున్నారు ముఖ్యంగా పెద్దలు డిప్రెషన్ లోకి వెళ్లి ఆత్మహత్య చేసుకుంటున్న నేపథ్యంలో చిన్న పిల్లలు కూడా తీవ్రస్థాయిలో ఈ ఒత్తిడికి గురవుతున్నారు కాబట్టి తల్లిదండ్రులు పిల్లలు పెంచే విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కోసం...

సాధారణంగా ప్రతి తల్లీ తండ్రీ చేసే పొరపాటు ఇతరులతో తతమ పిల్లల్ని పోల్చడం. అలా పోల్చని వాళ్లని వేళ్ళ మీద లెక్క పెట్టచ్చు. పక్కింటి చింటూ చూడు. ఎంత బుద్ధిగా ఉంటాడో, నువ్వే ఇంత అల్లరి చేస్తున్నావు అనో, ఫలానా వాళ్ల పాప చూడు. ఎంత బాగా చదువుతుందో, నువ్వసలు పుస్తకం ముట్టవు అనో... ఇలా మరొకరితో మీ పిల్లలకి పోలిక చెప్పడమంటే వాళ్ళని లెక్కలేకుండా చూడడమేనని, దానివల్ల వారు తమ ప్రవర్తనను మార్చుకోకపోగా, మరింత దూకుడుగా, అల్లరిగా ప్రవర్తిస్తారని చైల్డ్ సైకాలజిస్టులు చెబుతున్నారు. పోల్చి చెప్పడం వల్ల వారిలో అనవసరమైన ఈర్ష్య, అసూయలు పెరుగుతాయనీ, అందుకే పోలికల జోలికి పోకూడదని చెబుతారు.

పెద్దవాళ్ల దగ్గర ఉంచడం మేలు

పిల్లలను ఇంట్లో ఒంటరిగా ఉంచకుండా వారి అమ్మమ్మలు, తాతయ్యలతో కలిపి ఉంచడం మేలు. దీంతో వారు పెద్దల నుంచి ఎన్నో మంచి విషయాలు నేర్చుకుంటారు. ఇక పిల్లల భద్రత గురించి ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

మరేం చేయాలి?

మన బంగారాలని వాళ్లతో వీళ్లతో పోల్చి చెప్పడానికి బదులు మీకు వాళ్ళెంత ప్రత్యేకమో, వాళ్ళంటే ఎంత ఇష్టమో చెప్పండి. మీ పిల్లలు వాళ్ళల్లో వాళ్ళు కూడా ఎలాంటి పోలికలూ పెట్టుకోకుండా చూడటం కూడా ముఖ్యం.

సరదాగా గడపండి

మీకు సమయం దొరికినప్పుడు, పిల్లలతో సరదాగా గడపండి. ఆ సమయంలో మీరు ఉద్యోగాలు చేస్తూ ఎందుకు కష్టపడుతున్నారో పిల్లలకు వివరించండి. దీనివల్ల మీ పిల్లల భావోద్వేగాలు మీకు బాగా తెలుస్తాయి. తద్వారా పిల్లలు కూడా మీకు మద్దతు ఇవ్వడానికి తమ వంతు ప్రయత్నం చేస్తారు. మీరు ఆఫీస్ నుండి తిరిగి వచ్చాక, మీ పిల్లలతో సాధ్యమైనంత ఎక్కువ సమయాన్ని కేటాయించండి. ఇక వారంతాల్లో పూర్తి సమయాన్ని వారికే కేటాయించండి. పిల్లలతో విభిన్న పనులు ప్లాన్ చేయండి. వారికి ఇష్టమైన పనులు, వంటలు చేసి పెట్టండి. పిక్నిక్‌కి, పార్క్‌కి, సినిమాలకు తీసుకెళ్లండి.

బ్రహ్మాస్త్రం వేయకండి

కొంతమంది తల్లిదండ్రులు పిల్లల విషయంలో అతి జాగ్రత్తలు తీసుకుంటూ ఉంటారు ఇది మాత్రం అంత మంచి పద్ధతి కాదు. ఎందుకంటే పిల్లలు తప్పు చేయడం సహజం. అలా తప్పు చేశారన్న కోపంతో వారిని కఠినంగా దండించామనుకోండి, ఆ తప్పును కప్పి పుచ్చడం కోసం ఇంకా అనేక తప్పులు చేస్తారు. అందువల్ల వారు ఏదైనా తప్పు చేసినప్పుడు ఒకటికి రెండుసార్లు ఓపిగ్గా చెప్పి చూడండి. అలా చెప్పినప్పటికీ మారకపోతే అప్పుడు దగ్గర కూర్చోబెట్టుకుని స్వరం పెంచి మాట్లాడండి. అంతే కానీ చిన్న తప్పు చేసినా పిల్లలపై మీ ప్రతాపం చూపించడం వల్ల వారు తీవ్ర అభద్రతా భావానికి లోనవుతారు.

టైమ్ టేబుల్ సెట్ చేయండి...

పిల్లలు ఒక వయసుకు వచ్చిన తర్వాత ఇంట్లో ఒంటరిగా వదిలివెళుతున్నప్పుడు వారికి ఒక నిర్దిష్టమైన టైమ్ టేబుల్‌ను సెట్ చేయాలి. ఎప్పుడు చదవాలి? ఎప్పుడు తినాలి? ఎప్పుడు ఆడుకోవాలి? ఎప్పుడు పడుకోవాలి... తదితర విషయాలకు వారితో మాట్లాడి అన్నిటికీ టైం ఫిక్స్ చేయండి. పిల్లలు కచ్చితంగా ఈ టైం టేబుల్‌ను పాటించేలా చూడండి. ఇక వారి వస్తువులను వారే సర్దిపెట్టుకునేలా, వారి పనులు వారే చేసుకునేలా అలవాటు చేయండి. ఇక ఆఫీసుకు వెళ్లినా ఇంట్లోని పిల్లల పరిస్థితి గురించి అడగడానికి అప్పుడప్పుడు ఫోన్ చేస్తూ ఉండండి.

ప్లే గ్రౌండ్‌కు పంపండి


పిల్లలకు కాసిని మార్కులు తక్కువ వచ్చాయని వారిని వత్తిడి చేయద్దు. ఎందుకంటే కేవలం మార్కుల కోసం చదివే చదువుల వల్ల పిల్లలు అధిక ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ర్యాంక్స్ కోసం ఐదో తరగతి నుంచే ప్లే గ్రౌండ్ కి దూరంగా టాబ్లెట్స్, కంప్యూటర్స్ ముందు కూర్చో పెట్టి కంప్యూటర్ కోడింగ్ సైతం నేర్పిస్తున్నారు. దీనివలన పిల్లల భవిష్యత్తు పై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంటుంది. పిల్లలు చిన్నప్పటినుంచి ప్లే గ్రౌండ్ లో ఆటలు ఆడుకునే విధంగా ప్రోత్సహించాలి. ప్లే గ్రౌండ్‌లో ఆడుకోకుండా ఇంట్లో కూర్చుని కంప్యూటర్ గేమ్స్ ఆడుకునేలా మాత్రం వారిని ఎంకరేజ్ చేయద్దు. కంప్యూటర్ గేమ్స్ ఎప్పుడైనా ఆడుకుంటే ఫరవాలేదు కానీ, వారికి శారీరక వ్యాయామం, ఉత్సాహం కావాలంటే మాత్రం ఆడుకోవడాన్ని ప్రోత్సహించండి. శారీరకంగా చురుగ్గా ఉంటే మానసికంగా కూడా చురుగ్గా ఉంటారు.

ఇచ్చి పుచ్చుకోవడం నేర్పండి

చిన్నప్పటి నుంచి తల్లిదండ్రులు పిల్లలకు ఆత్మాభిమానంతో జీవించడం, పెద్దలకు గౌరవం ఇవ్వడం నేర్పించాలి. గౌరవం గానీ, ప్రేమ కానీ మనం ఇతరులకు ఇస్తేనే మనకు తిరిగి వస్తాయని చెప్పాలి. తద్వారా వారు భవిష్యత్తులో తల్లిదండ్రులను ప్రేమగా చూసుకోవడమే కాకుండా సమాజం పట్ల మంచి ప్రేమను కనబరుస్తారు. అదేవిధంగా తోటి పిల్లలతో వ్యత్యాసాలు చూసుకోకుండా సమానంగా నడుచుకునే విధంగా విలువలతో జీవించడం నేర్పాలి. సాధారణంగా చాలామంది పిల్లలు మనం చెప్పే మాటలు వినరు, కానీ మనం చేసేవి చూసి అలానే చేస్తారు. అందువల్ల మన పిల్లల ముందు మన నడవడిక బాగుండాలని గుర్తుంచుకోండి.

● ఆరోగ్యాహారం

ఒత్తిడిని తినేయండి



మానసిక ఆరోగ్యం బాగుండాలంటే కొన్ని రకాల పోషకాలను తప్పకుండా తీసుకోవాలి. దానికి పిల్లలు, పెద్దలు అనేం లేదు. ఈ కింద ఇచ్చిన కొన్ని పదార్థాలలో మానసికంగా చురుగ్గా ఉంచే కొన్ని కారకాలు ఉన్నట్లు పోషకాహార నిపుణులు గుర్తించారు. వాటిని తీసుకోవడం వల్ల ఒత్తిడి తగ్గి చురుగ్గా ఉండగలం. అవేమిటో చూద్దాం.

మానసిక ఆందోళన, ఒత్తిడి, కుంగుబాటు, డిప్రెషన్.. పేరు ఏదైనా వచ్చిన తర్వాత బాధ పడేకంటే రాకుండా చూసుకోవడం చాలా మేలు. ఈ కింద ఇచ్చిన కొన్ని పదార్థాలు తీసుకోండి. శారీరకంగానే కాదు, మానసికంగానూ ఆరోగ్యంగా ఉండండి.



పొద్దుతిరుగుడు గింజలు... వీటిలో విటమిన్ 'ఇ' అధిక స్థాయిలో ఉంటుంది. ఇది మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సమర్థంగా పనిచేస్తుంది.



వెల్లుల్లి... వెల్లుల్లిలో సల్ఫర్ సమ్మేళనాలు అధికంగా ఉంటాయి. ఇవి గ్లటాథియోన్ అనే యాంటీ ఆక్సిడెంట్‌ను ఉత్పత్తిచేస్తాయి. ఇది ఒత్తిడిని ఎదుర్కొనే రక్షణ ఛత్రంలో మొదటి మూలకంగా పనిచేస్తుంది.

గుడ్లు... గుడ్లలో పోషకాలు పుష్కలం అనే విషయం తెలిసిందే. వీటిలో విటమిన్లు, మినరల్స్, అమైనో ఆమ్లాలు, యాంటీ ఆక్సిడెంట్స్ సంతృప్త స్థాయిలో లభిస్తాయి. ప్రత్యేకంగా ఇందులో చోలిన్ అనే పోషకం పుష్కలంగా ఉంటుంది. ఇది మెదడు ఆరోగ్యంగా ఉండేందుకు తోడ్పడుతుందని, అలాగే ఒత్తిడి నివారణకు సమర్థంగా పనిచేస్తుందని వైద్యులు గుర్తించారు.

నువ్వులు... నువ్వులతో తయారుచేసే పదార్థాలలో ఎల్-ట్రిప్టోఫాన్ అనే అమైనో ఆమ్లం పాళ్లు ఎక్కువ. ఇది మనసును ఉల్లాసంగా ఉంచే డోపమైన్, సెరటోనిన్ ఉత్పత్తిలో ఉపయోగపడుతుంది. అలాగే ఒత్తిడిని తగ్గించేందుకు తోడ్పడుతుంది. 25 మంది యువకులకు నాలుగు రోజుల పాటు నువ్వుల ఉండలను తినిపించి పరీక్షించినప్పుడు వారిలో ఆందోళన, ఒత్తిడి స్థాయిలు గణనీయంగా తగ్గినట్లు ఓ సర్వేలో తేలింది.



నువ్వులతో రకరకాల స్నాక్స్ తయారు చేసుకోవచ్చు. ఏదైనా పదార్థాన్ని రుచిగా ఉండేలా తయారు చేసుకోవడం వల్ల వాటిని తినే విధంగా మెదడు కూడా మనల్ని ప్రోత్సహిస్తుంది.

లైఫ్@360

రుచికే కాదు.. ఆరోగ్యానికి కూడా...

ఆరోగ్యాన్ని ఇచ్చే పండ్లు అంటే ఎక్కువ మంది యాపిల్ గురించి మాట్లాడతారు. కానీ దానితో సమానంగా దానిమ్మ కూడా ఆరోగ్యాన్ని ఇస్తుందనే విషయం చాలా తక్కువ మందికే తెలుసు. దీనివల్ల బోలెడు ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి.

చాట్, స్వీట్ డిష్, ఐస్ క్రీమ్, స్మూతీస్ ఇలా ఏది చేసినా దాని మీద తప్పనిసరిగా గార్నిషింగ్ కోసం దానిమ్మ గింజలను ఉపయోగిస్తారు. ఎందుకంటే ఏదోవిధంగా దానిమ్మను తీసుకోవడం వల్ల ధమనుల్లో కొవ్వు చేరకుండా చేస్తుంది. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలని అనుకుంటే తప్పకుండా దానిమ్మ పండ్లు తినడం అలవాటు చేసుకోండి.

దానిమ్మ వల్ల ప్రయోజనాలు...



- దానిమ్మ మెదడు ఆరోగ్యానికి చాలా మంచిది. రోగనిరోధక శక్తిని ఇస్తుంది. పోషకాలతో నిండి ఉంటుంది. తక్కువ కేలరీలు, కొవ్వు ఉంటాయి. విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్ పుష్కలంగా ఉన్నాయి.
- యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా లభిస్తాయి. ఇవి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. వ్యాధులను నిరోధించేందుకు సహాయపడతాయి. వృద్ధాప్యానికి దారి తీసే ఫ్రీ రాడికల్స్ నుంచి మనలని రక్షిస్తుంది. చెడు కొలెస్ట్రాల్ ని తగ్గిస్తుంది. శరీరం నుంచి అదనపు కొవ్వుని తొలగించడంలో సహాయపడుతుంది.
- రక్తాన్ని పలుచన చేసి రక్తం గడ్డకట్టకుండా నిరోధిస్తుంది. శరీరంలోని ఆక్సిజన్ స్థాయిలను మెరుగుపరిచి రక్తప్రసరణకి ఎటువంటి హాని కలగకుండా చూస్తుంది.
- జీర్ణ ప్రక్రియ సజావుగా జరిగేలా చూస్తుంది. ప్రతిరోజు ఒక దానిమ్మ పండు తింటే మలబద్ధకం సమస్య దరి చేరదు.
- దానిమ్మలోని గుణాలు ధమనుల్లో ఆక్సీకరణ ఒత్తిడిని, వాపును తగ్గిస్తాయి. దానిమ్మ రక్తపోటుని అదుపులో ఉంచుతుంది. గుండె పోటు, స్ట్రోక్ రాకుండా అడ్డుకుంటుంది.
- అధిక రక్తపోటుతో బాధపడే వాళ్ళు కనీసం మూడు నెలల పాటు ప్రతి రోజు మూడు దానిమ్మ పండ్లు తింటే చాలా మంచిదని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. కార్డియో వాస్కులర్ డిసీజ్ బారిన పడకుండా కాపాడుతుంది.
- రక్తహీనత సమస్య ఉన్న వాళ్ళు మందులు వాడే ముందు రోజూ దానిమ్మను తిని చూడటం ఉత్తమం. ఎందుకంటే దానిమ్మ ఎర్ర రక్తకణాల సంఖ్యను పెంచుతుంది.
- దానిమ్మ పండులోనే కాదు తొక్కల్లో కూడా విటమిన్ ఏ, సి, కాల్షియం, ఐరన్, మెగ్నీషియం, విటమిన్ బి6 పోషకాలు ఉన్నాయి. అందుకే దానిమ్మ గింజలు తిన్నతర్వాత తొక్కలు పడేయకుండా వాటిని ఎండబెట్టి పొడి చేసుకుని పెట్టుకోండి.
- కీళ్ల నొప్పులతో బాధపడే వాళ్ళు దానిమ్మ తొక్కలు ఎండబెట్టుకుని చేసుకున్న పొడిని నీళ్ళలో వేసి మరిగించి తాగితే మంచిది.
- దానిమ్మ తొక్కల పొడిని వేడి నీళ్ళలో కలిపి పేస్ట్ లా చేసుకుని ముఖానికి రాసుకుంటే మొటిమల సమస్యను అధిగమించవచ్చు.

సినిమా

నాటు నాటు ప్రజల పాట

- రామ్‌చరణ్

లాస్ ఏంజిల్స్‌లో ఇటీవల జరిగిన 95వ ఆస్కార్ అవార్డు ప్రదానోత్సవంలో 'ఆర్‌ఆర్‌ఆర్' సినిమాలోని 'నాటు నాటు' పాటకు బెస్ట్ ఒరిజినల్ స్కోర్ విభాగంలో సంగీతదర్శకుడు కీరవాణి, రచయిత చంద్రబోస్ ఆస్కార్ అవార్డులను అందుకున్న విషయం తెలిసిందే. ఈ అవార్డు వేడుక కోసం లాస్ ఏంజిల్స్ వెళ్లిన దర్శకుడు రాజమౌళి, ఆయన సతీమణి, కాస్ట్యూమ్ డిజైనర్ రమా రాజమౌళి, తనయుడు కార్తికేయ, సంగీత దర్శకుడు కీరవాణి, గాయకుడు కాలభైరవ, నటుడు శ్రీ సింహా తదితరులు శుక్రవారం హైదరాబాద్ చేరుకున్నారు. కాగా ఆస్కార్ అవార్డు సాధించడం గురించి రాజమౌళిని స్పందించమని విలేకర్లు అడగ్గా.. ఆయన 'జైహింద్' అన్నారు. ఇక ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు లాస్ ఏంజిల్స్ నుంచి శుక్రవారం ఢిల్లీ చేరుకున్నారు రామ్‌చరణ్. 'నాటు నాటు' పాటకు ఆస్కార్ అవార్డు రావడం గురించి స్పందిస్తూ– ''భారతీయ అభిమానులందరూ 'ఆర్‌ఆర్‌ఆర్'ను ఆదరించారు. 'నాటు నాటు' పాటను సూపర్ హిట్ చేశారు. 'నాటు నాటు' పాట మాది కాదు.. ప్రజల పాట. ప్రేక్షకుల అభిమానమే ఆస్కార్‌కి దారి వేసింది, అవార్డు వరించేలా చేసింది. వారితో పాటు కీరవాణి, చంద్రబోస్, రాజమౌళిగార్లకి కూడా థ్యాంక్స్ చెబుతున్నాను'' అని పేర్కొన్నారు రామ్‌చరణ్.



● రామ్‌చరణ్

తప్పుగా అర్థం చేసుకున్నారు: కాలభైరవ

ఆస్కార్ వేదికపై 'నాటు నాటు' పాటను పాడినందుకు ఆనందంగా ఉందంటూ ఓ నోట్‌ను సోషల్ మీడియాలో షేర్ చేశారు కాలభైరవ. ''ఆస్కార్ వేదికపై 'నాటు నాటు' పాటను ప్రదర్శించినందుకు గర్వపడుతున్నాను. నాకు ఈ విలువైన క్షణాలు దక్కడానికి రాజమౌళి బాబా, నాన్న (కీరవాణి), కొరియోగ్రాఫర్ ప్రేమ్‌రక్షిత్ మాస్టర్, కార్తికేయ అన్న, అమ్మ, పెద్దమ్మ... ఇలా మరి కొందరు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో కారణమయ్యారు. యూఎస్ టీమ్ కూడా హెల్ప్ చేసింది. వీరి సహకారం, ప్రోత్సాహం లేకపోతే ఆస్కార్ వేదికపై నా ప్రదర్శన వీలయ్యేది కాదు'' అని ఆ నోట్‌లో చెప్పు కొచ్చారు కాలభైరవ. కాగా ఎన్టీఆర్, రామ్‌చరణ్‌ల పేర్లను కాలభైరవ ప్రస్తావించకపోవడంతో ఈ ఇద్దరి హీరోల అభిమానులు, కొందరు నెటిజన్లు తప్పుబడుతూ కామెంట్స్ చేశారు. దీంతో ఈ విషయంపై సోషల్ మీడియా వేదికగా కాలభైరవ స్పందించారు. ''ఆర్‌ఆర్‌ఆర్ సినిమా, ఇందులోని 'నాటు నాటు' పాట సక్సెస్‌కు తారక్ అన్న, చరణ్ అన్న ముఖ్యులు. అందులో సందేహం లేదు. అయితే నేను ఆస్కార్ వేదికపై నా ప్రదర్శనకు సంబంధించిన విషయం గురించి మాత్రమే ఆ నోట్‌లో ప్రస్తావించాను. అది తప్పుగా అర్థమైనట్లుంది. అయినప్పటికీ నా మాటలను క్షమించమని అడుగుతున్నాను'' అని కాలభైరవ పేర్కొన్నారు.



● కాలభైరవ

ఆస్కార్ వేదికపై షాక్ అయ్యా: గునీత్ మోంగా

'ది ఎలిఫెంట్ విస్పరర్స్'కు డాక్యుమెంటరీ షార్ట్ సబ్జెక్ట్ విభాగంలో ఆస్కార్ అవార్డు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ డాక్యుమెంటరీ నిర్మాత గునీత్ మోంగా శుక్రవారం ముంబై చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమె చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. మామూలుగా ఆస్కార్ అవార్డు అందుకున్నవారు తమ యాక్సెప్టెన్సీ స్పీచ్‌ను 45 సెకన్లలో పూర్తి చేయాలి. 'ది ఎలిఫెంట్ విస్పరర్స్' దర్శకురాలు కార్తీకి అన్ని సెకన్లలోనే పూర్తి చేశారు. కానీ నిర్మాత గునీత్ మోంగా కాస్త ఎక్కువ టైమ్ తీసుకుని మాట్లాడుతుండగా స్పీచ్ ఆపాలన్నట్లుగా వెనకనుంచి మ్యూజిక్ ప్లే చేశారు ఆస్కార్ నిర్వాహకులు. అలాగని నిర్వాహకులు ఈ 45 సెకన్ల నియమంలో కఠినంగా ఏమీ లేరు. బెస్ట్ యానిమేటెడ్ షార్ట్ ఫిల్మ్ విభాగంలో ఆస్కార్ అవార్డు గెల్చుకున్న చార్లీ మాక్సే, మ్యాథ్యూ ఫ్రాండ్‌లు 45 సెకన్ల కన్నా ఎక్కువగా మాట్లాడినా, నిర్వాహకులు అభ్యంతరం వ్యక్తం చేయలేదు. ఈ విషయంపై గునీత్ మోంగా స్పందించారు. ''ఇండియాకు తొలి ఆస్కార్ అవార్డును సాధించామనే గొప్ప విషయం గురించి చాలా మాట్లాడాలనుకున్నాను. కానీ నా స్పీచ్‌ను కట్ చేశారు. షాక్ అయ్యాను. ఇండియా తరపున నేను మాట్లాడే అవకాశాన్ని నా నుంచి ఎవరో లాగేసుకున్నట్లుగా అనిపించింది. నేను మళ్లీ ఆస్కార్‌కు వెళతాను. అప్పుడు తప్పకుండా నా గొంతు మళ్లీ వినిపిస్తాను'' అని పేర్కొన్నారు గునీత్.



● గునీత్ మోంగా

ఆర్‌ఆర్‌ఆర్... నెంబర్ 3

భారతీయ చిత్రాల్లో అత్యధిక గ్రాస్ కలెక్షన్స్‌ను సాధించిన జాబితాలో 'ఆర్‌ఆర్‌ఆర్' మూడోస్థానంలో నిలిచింది. ఇదివరకు ఈ స్థానంలో 'కేజీఎఫ్: చాప్టర్ 2' ఉండేది. తొలుత అత్యధిక గ్రాస్ కలెక్షన్స్‌ను సాధించిన ఇండియన్ చిత్రాల జాబితాలో వరుసగా 'దంగల్' (దాదాపు రూ. 1900 కోట్లు), 'బాహుబలి: ది కన్‌క్లూజన్'(రూ. 1800 కోట్లు), 'కేజీఎఫ్: చాప్టర్ 2' (రూ. 1230 కోట్లు), 'ఆర్‌ఆర్‌ఆర్' (దాదాపు రూ. 1150 కోట్లు), 'పఠాన్' (రూ. 1050 కోట్లు.. ఇంకా ప్రదర్శితమవుతోంది) ఉన్నాయి.

అయితే గత ఏడాది అక్టోబరులో జపాన్‌లో విడుదలైన 'ఆర్‌ఆర్‌ఆర్' ఇప్పటికీ ప్రదర్శితమవుతోంది. జపాన్ బాక్సాఫీస్ వద్ద 'ఆర్‌ఆర్‌ఆర్' ఇప్పటివరకు రూ. 80 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్స్ సాధించింది. అలాగే 'ఆస్కార్' ప్రచారంలో భాగంగా అమెరికాలో ఈ నెల 3న, తెలుగు రాష్ట్రాల్లో ఈ నెల 10న 'ఆర్‌ఆర్‌ఆర్'ను రీ రిలీజ్ చేశారు. దీంతో మరికొన్ని కలెక్షన్స్ వచ్చాయి. ఈ వసూళ్లు మొత్తాన్ని కలిపితే 'కేజీఎఫ్: చాప్టర్ 2' గ్రాస్ కలెక్షన్స్‌ను 'ఆర్‌ఆర్‌ఆర్' దాటిందని ట్రేడ్ విశ్లేషకులు చెబుతున్నారు.

అందుకే విశ్వక్ డైరెక్షన్ మానేయాలి

- ఎన్టీఆర్



● కరాటే రాజు, ఎన్టీఆర్, విశ్వక్‌సేన్, నివేదా పేతురాజ్

''సినిమా పట్ల విశ్వక్ సేన్‌కి ఎంతో పిచ్చి ఉంది. ఆ పిచ్చి తగ్గిపోకూడదు. ఇలాంటివాళ్లను ప్రోత్సహిస్తేనే పరిశ్రమ ఇంకా ముందుకెళుతుంది. 'దాస్ కా ధమ్కీ' హిట్ అవ్వాలి'' అని హీరో ఎన్టీఆర్ అన్నారు. విశ్వక్ సేన్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'దాస్ కా ధమ్కీ'. నివేదా పేతురాజ్ హీరోయిన్. కరాటే రాజు (విశ్వక్ సేన్ తండ్రి) నిర్మించిన 'దాస్ కా ధమ్కీ' ఈ నెల 22న విడుదలకానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో ఎన్టీఆర్ మాట్లాడుతూ– ''ఒకే చట్రంలో ఇరుక్కుపోతున్నానని చాలా కాలం తర్వాత రియలైజ్ అయిన నేను, మీరు (అభిమానులు) కాలర్ ఎత్తుకునే సినిమాలు చేస్తానని మాట ఇచ్చాను.. ఆ మాట అన్నప్పుడే నటుడిగా నేను మళ్లీ పుట్టాను. వైవిధ్యమైన నటన కోసం నేను తాపత్రయపడుతున్నాను కాబట్టే మిమ్మల్ని కాలర్ ఎగరేసుకునేలా చేస్తున్నానని అనుకుంటున్నాను. విశ్వక్ కూడా ఒకే తరహా పాత్రల నుంచి బయటికొచ్చి, కొత్తగా చేస్తున్నాడు. 'దాస్ కా ధమ్కీ' బ్లాక్ బస్టర్ అవ్వాలి. ఆ తర్వాత తను దర్శకత్వం మానేయాలి. ఎందుకంటే కొత్త యువ దర్శకులకు నీలాంటి వాళ్లు అవకాశాలు ఇవ్వాలి. ప్రస్తుతం తెలుగు సినిమా ప్రపంచ చిత్ర పటంలో ఆల్‌టైమ్ టాప్‌లో ఉంది. 'ఆర్‌ఆర్‌ఆర్' ఈ రోజు ప్రపంచ చిత్రపటంలో నిలబడిందంటే, ఆస్కార్ అవార్డుని సొంతం చేసుకుందంటే దానికి మా యూనిట్‌తో పాటు యావత్ తెలుగు, భారతదేశ చిత్రపరిశ్రమ, ప్రేక్షక దేవుళ్లు కూడా కారణం. కీరవాణి, చంద్రబోస్‌గార్లు ఆస్కార్ అవార్డు తీసుకుంటున్నప్పుడు నాకు వాళ్లు కనిపించలేదు.. ఇద్దరు భారతీయులు కనిపించారు.. ఇద్దరు తెలుగువాళ్లు కనిపించారు'' అన్నారు. విశ్వక్ సేన్ మాట్లాడుతూ– ''ఇండియాలో బెస్ట్ యాక్టర్ ఎవరంటే ఎన్టీఆర్ అన్న అని నేను ఎప్పుడో చెప్పాను. నా సినిమాని ప్రోత్సహించేందుకు ఎన్టీఆర్ వచ్చాడు. ఆయన రాకతో నా సినిమా బ్లాక్‌బస్టర్ స్టార్ట్ అయిపోయినట్లే''అన్నారు. ''ఫలక్‌నుమా దాస్' తీసినప్పుడు మా అబ్బాయి విశ్వక్ ఎవరికీ తెలియదు. ఎంతో పబ్లిసిటీ చేసి, సినిమా విడుదలకి ముందే స్టార్‌డమ్ తెచ్చుకున్నాడు. 'దాస్ కా ధమ్కీ' కోసం 15 నెలలు కష్టపడ్డాడు'' అన్నారు కరాటే రాజు.


మా నమ్మకం నిజమైంది



● హర్షిత్ రెడ్డి, హన్షిత

''ప్రతి ఊరిలో, ప్రతి కుటుంబంలో జరిగే కథే 'బలగం'. ఈ సినిమా ప్రేక్షకులకు నచ్చుతుందని వేణు కథ చెప్పినప్పుడే నమ్మాం. అది నిజమైంది'' అని నిర్మాతలు హర్షిత్ రెడ్డి, హన్షిత ('దిల్' రాజు కుమార్తె) అన్నారు. ప్రియదర్శి, కావ్యా కల్యాణ్‌రామ్ జంటగా వేణు ఎల్దండి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'బలగం'. 'దిల్' రాజు సారథ్యంలో శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత నిర్మించిన ఈ సినిమా ఈ నెల 3న విడుదలైంది. ఈ సందర్భంగా హన్షిత మాట్లాడుతూ– ''శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌పై నాన్నగారు ('దిల్' రాజు) తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో భారీ సినిమాలు నిర్మిస్తున్నారు. ప్రతిభ ఉన్నవారిని ప్రోత్సహించడంతో పాటు ప్రయోగాత్మక, వైవిధ్యమైన కథలను చిన్న సినిమాల ద్వారా ప్రేక్షకులకు అందివ్వాలనే 'దిల్' రాజు ప్రొడక్షన్ బ్యానర్‌ని స్థాపించాం. 'బలగం'ని ప్రేక్షకులతో కలిసి థియేటర్‌లో చూశాక నాన్నగారు 'మీరు ఎన్ని సినిమాలు తీసినా 'బలగం' మాత్రం గుర్తుండిపోతుంది' అని అభినందించారు'' అన్నారు. హర్షిత్ రెడ్డి మాట్లాడుతూ– ''బలగం' చిత్రానికి రోజు రోజుకు వసూళ్లు పెరుగుతున్నాయి. మా తొలి సినిమాకే ఇంత మంచి పేరు రావడం హ్యాపీ. ప్రస్తుతం యష్ మాస్టర్ హీరోగా శశి అనే కొత్త డైరెక్టర్‌తో ఓ సినిమా నిర్మిస్తున్నాం'' అన్నారు.

బికిలి అంటే..?



● విజయ్ ఆంటోని

'వీళ్లే బికిలి బికిలి బిలి బిలి.. బికిలి బికిలి బిలి బిలి...' అంటూ పాడారు విజయ్ ఆంటోని. 2016లో విజయ్ ఆంటోని హీరోగా రూపొందిన తమిళ చిత్రం 'పిచ్చైక్కారన్' తెలుగులో 'బిచ్చగాడు'గా విడుదలై ఘనవిజయం సాధించిన విషయం తెలిసిందే. శశి దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందింది. ఇప్పుడు 'బిచ్చగాడు'కు సీక్వెల్‌గా 'బిచ్చగాడు 2' వస్తోంది. విజయ్ ఆంటోని నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్నారు. విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పొరేషన్ పతాకంపై ఫాతిమా విజయ్ ఆంటోని నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఈ వేసవిలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాలోని 'బికిలి' అనే పాట మ్యూజిక్ వీడియోను రిలీజ్ చేశారు. భాష్యశ్రీ రాసిన ఈ పాటకు మ్యూజిక్ కంపోజింగ్, సింగర్ విజయ్ ఆంటోనీయే కావడం విశేషం. ఇక పేదవాళ్ల పేదరికాన్ని ఉపయోగించుకుని తన ధనబలంతో వారిని బానిసలుగా చేసి, డబ్బు ఉందన్న అహంకారంతో తిరిగే వాళ్లకు తాను బికిలీ అని పేరు పెట్టినట్లు విజయ్ ఆంటోని పేర్కొన్నారు.

కామెడీ.. యాక్షన్



● యోగేశ్వర్, సుమన్, జీవీవీ గిరి

యోగేశ్వర్, అతిథి జంటగా సాయి శివాజీ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'పరారీ'. గాలి ప్రత్యూష సమర్పణలో జీవీవీ గిరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 30న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్‌లో కాంగ్రెస్ లీడర్ అంజన్ కుమార్ యాదవ్, నటుడు సుమన్, నిర్మాత ప్రసన్న కుమార్ ట్రైలర్‌ను విడుదల చేశారు. డైరెక్టర్ చంద్ర మహేష్, నిర్మాతలు టి. రామసత్యనారాయణ, ప్రతాని రామకృష్ణ గౌడ్ థియేట్రికల్ ప్రోమోను, నటి కవిత సాంగ్ ప్రోమోను రిలీజ్ చేశారు. ''మంచి కథ, కథనాలతో నిర్మించిన మా 'పరారీ' అందర్నీ మెప్పిస్తుంది'' అన్నారు జీవీవీ గిరి. ఈ చిత్రానికి సంగీతం: మహిత్ నారాయణ్.

వైరానికి సిద్ధం



● మోనాల్, ప్రణమ్

నటుడు దేవరాజ్ తనయుడు ప్రణమ్ దేవరాజ్ హీరోగా నటించిన చిత్రం 'వైరం'. సాయి శివం జంపాన దర్శకత్వం వహించిన ఈ మూవీలో మోనాల్ హీరోయిన్. యువాన్స్ నాయుడు సమర్పణలో తెలుగు, కన్నడ భాషల్లో జె. మల్లికార్జున నిర్మించారు. నటులు దేవరాజ్, చంద్ర దేవరాజ్ శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి బ్యానర్ లోగోను లాంచ్ చేయగా, నటులు బెనర్జీ, కాశీ విశ్వనాథ్ 'వైరం' టీజర్‌ను విడుదల చేశారు. దేవరాజ్ మాట్లాడుతూ– ''తెలుగు ప్రేక్షకులు నన్నెంతో ఆదరించారు. హీరోగా వస్తున్న నా కుమారుడు ప్రణమ్‌ని కూడా ఆదరించాలి'' అన్నారు. ''త్వరలో మా సినిమాని విడుదల చేస్తాం'' అన్నారు జె. మల్లికార్జున. ''ఈ సినిమా బాగా వచ్చింది'' అన్నారు సాయి శివన్ జంపాన. ఈ చిత్రానికి సహనిర్మాత: శీలం త్రివిక్రమ్ రావు, అరిపిరాల కళ్యాణ్ శాస్త్రి, సంగీతం: మహతి స్వరసాగర్, కెమెరా: సామల భాస్కర్.